విశాఖపట్టణం
గురువారం 28 మే 2026

For a pure tomorrow..

# జయ జయహే

jayajayahey.in సంపుటి: 9 సంచిక: 125 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool




## రెండు భారతీయ భాషలు తప్పనిసరి

9, 10 తరగతుల్లో అమలు చేయాల్సిందే

సీబీఎస్ఈ బోర్డు నిర్ణయంపై సుప్రీం ఆదేశాలు

2

# టీడీపీతోనే సుపరిపాలన

పుట్టుక.. ప్రయాణం.. ప్రస్థానం అంతా అద్భుతం

సామాన్యుడికి ధైర్యం.. భరోసా.. పసుపు జెండాతోనే

అరెస్టులు చేసినా, వేధించినా పోరాటం ఆపలేదు

యువత తలరాత మార్చింది తెలుగుదేశం పార్టీనే

తలసరి ఆదాయం పెంపు, జీవన ప్రమాణాలు మెరుగు

మహానాడు వాహనాలు తగ్గినా, మీలో జోష్ తగ్గలేదు

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉద్ఘాటన



(అమరావతి - జయజయహే)

మహానాడు అంటే కార్యకర్తల పండుగ అని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు అన్నారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రారంభమైన మహానాడు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ "వర్చువల్ వల్ల వాహనాల జోష్ తగ్గిందే కానీ మీలో జోష్ తగ్గలేదు. క్లస్టర్ల నుంచి లక్షలాది మంది పాల్గొన్నారు. మారింది మీటింగ్ విధానమే, మహానాడు విధానాలు కాదు. మహానాడు అన్ని అంశాలపై చర్చించుకుందాం. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనను పరిచయం చేసింది టీడీపీ' అని వెల్లడించారు. తెలుగుదేశం పుట్టుక, ప్రయాణం, ప్రస్తానం అన్నీ అద్భుతాలేనని చంద్రబాబు అన్నారు. జాతీయ జెండా దేశానికి గౌరవం, పసుపు జెండా తెలుగువారి ఆత్మవిశ్వాసం అని, పసుపు జెండా చూస్తే ధైర్యం, నమ్మకం, భరోసా కలుగుతుందన్నారు. తెలుగుదేశంపై ప్రజల అభిమానం, ఆదరణ శాశ్వతమన్నారు. నిరంతరం ప్రజాస్వామ్యం కోసం ఎన్నో పోరాటాలు చేశామన్నారు. అరెస్టులు, వేధింపులు ఎన్ని జరిగినా ప్రజా పోరాటాలు ఆపలేదని, చంపేస్తామని బెదిరించినా జై తెలుగుదేశం అంటూ ప్రాణాలు వదిలిపెట్టిన వీరులున్న పార్టీ టీడీపీ అని చంద్రబాబు పునరుద్ఘాటించారు. చంద్రయ్య, నందం సుబ్బయ్య వంటి కార్యకర్తల బలిదానాలు పార్టీ ఎన్నటికీ మర్చిపోదన్నారు. ఒకప్పుడు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై మాట్లాడం ..మిగతా 2లో



ఏకగ్రీవం అయితే సీరియస్‌గా

## తీసుకుంటా

స్థానికల్లో ప్రతీ చోటా పోటీ చేసి తీరాల్సిందే

పార్టీ అస్థిత్వానికి స్థానికలే పునాది

ఓట్లు తగ్గినా.. పెరిగినా డేంజరే

ఎస్ఐఆర్ ప్రక్రియ పట్ల అప్రమత్తంగా ఉండాలి

జూన్ 4 నుంచి 12 వరకు వెన్నుపోటుకు రెండేళ్లు

ప్రజల నిరసన చంద్రబాబుకు తగలాలి

మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ కీలక వ్యాఖ్యలు

పార్టీ కార్యాలయంలో నేతలతో సమావేశం

(తాడేపల్లి - జయజయహే)

మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేడు తాడేపల్లిలో నిర్వహించిన పార్టీ ముఖ్యనేతల సమావేశంలో అత్యంత కీలక వ్యాఖ్యలు చేశారు. జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలు , ఓటర్ల ప్రత్యేక సవరణ ప్రక్రియపై ఆయన పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం ..మిగతా 2లో

# మహిళలకు 33 శాతం సీట్లు

వచ్చే ఎన్నికల నుంచి అమలు

పార్లమెంట్ బిల్లుతో సంబంధం లేదు

మహానాడు వేదికగా లోకేశ్ సంచలన ప్రకటన

(అమరావతి - జయజయహే)

పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మహానాడు వేదికపై నుంచి నారా లోకేష్ అతిపెద్ద అనౌన్స్‌మెంట్ చేశారు. తెలుగుదేశం పార్టీ మహిళలకోసం తీసుకున్న చారిత్రక నిర్ణయాన్ని మహానాడు వేదికపై నుంచి ప్రకటించారు. మహిళా రిజర్వేషన్‌తో సంబంధం లేకుండా భవిష్యత్‌లో అన్ని ఎన్నికల్లో మహిళలకు 33శాతం సీట్లు రిజర్వు చేయాలని తెలుగుదేశం పార్టీ నిర్ణయించింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత జరుగుతున్న తొలి మహానాడులో నారాలోకేష్ ఈ తీర్మానాన్ని ..మిగతా 2లో



## ప్రక్షాళన రాజ్యాంగబద్ధమే

విపక్షాల అభ్యంతరాల తిరస్కరణ

ఈసీకి పూర్తి అధికారాలని స్పష్టీకరణ

ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై సుప్రీం కీలక తీర్పు

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)



ఓటరు జాబితాల సవరణపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెల్లడించింది. ఎస్ ఐ ఆర్ ప్రక్రియకు సుప్రీంకోర్టు బుధవారం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎన్నికల సంఘం అధికారాలను సమర్థించిన సుప్రీంకోర్టు.. ఆర్టికల్ 324 ప్రకారం ఈసీకి పూర్తి అధికారాలు ఉంటాయని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టులో దీనిపై సుదీర్ఘ విచారణ జరగ్గా.. అనంతరం ఈ తీర్పు వెలువరించింది. దీంతో ఈసీకి ఊరట కలిగినట్లయింది. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను అనేక రాష్ట్రాలు, పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. దీనిపై సుప్రీంకోర్టులో అనేక పిటిషన్లు ..మిగతా 2లో



## కేరళలో రాజకీయ హైడ్రామా

మాజీ సీఎం విజయన్ నివాసాల్లో ఈడీ సోదాలు

ఏక కాలంలో పదికి ప్రాంతాల్లో దాడులు

కుమార్తె వీణా విజయన్‌కు రూ. 1.72 కోట్లపై నజర్

రాజకీయ కక్ష సాధింపేనని సీపీఎం ఆగ్రహం

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

కేరళ రాజకీయాల్లో ప్రస్తుతం హైడ్రామా నడుస్తోంది. మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత ప్రతిపక్ష నేత పినరయి విజయన్ నివాసాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మెరుపు దాడులు నిర్వహించింది. ఈ ఘటనతో తిరువనంతపురంలో ఉద్రిక్తత ..మిగతా 2లో

## కర్ణాటక సీఎంగా డీకే..?

రాజీనామాకు సిద్ధరామయ్య ఓకే

నేడు అల్పాహార విందులో కీలక ప్రకటన

2023 ఒప్పందం అమలుకు శివకుమార్ పట్టు

కీలక మంత్రాంగం నడిపిన అధిష్టానం

జాతీయ రాజకీయాల్లోకి సిద్ధరామయ్య..?



(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

కర్ణాటక కాంగ్రెస్‌లో నెలకొన్న నాయకత్వ సందిగ్ధత క్లైమాక్స్‌కు చేరుకుంది. గత కొన్ని నెలలుగా సాగుతున్న 'అధికార పోరు'లో భాగంగా ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన పదవి నుంచి తప్పుకోనున్నారనే వార్తలకు పలు పరిణామాలు మద్దతు పలుకుతున్నాయి.. ఈ ఉత్కంఠ భరిత పరిణామాల మధ్య, గురువారం ఉదయం బెంగళూరులోని సీఎం అధికారిక నివాసం 'కావేరి'లో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు సిద్ధరామయ్య అల్పాహార విందు ఇవ్వనున్నారు. ఈ భేటీ కర్ణాటక రాజకీయాల్లో అధికార ..మిగతా 2లో



## రూ. 5కే చేపల కూర భోజనం

400 క్యాంటీన్లలో బెంగాల్ ప్రభుత్వం అమలు

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో చేపల కూర ఎన్నికల సమయంలో హాట్ టాపిక్ అయింది. ఇప్పుడు కూడా చేపలకూరను రాజకీయంగా హైలెట్ అవుతోంది. పశ్చిమ బెంగాల్ సంస్కృతిలో అంతర్భాగమైన ..మిగతా 2లో

For a pure tomorrow.. జయహో

# టీడీపీతోనే సుపరిపాలన





**మొదటి పేజీ తరువాయి...**

కానీ ఇప్పుడు గేర్ మార్చి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై మాట్లాడుతున్నామన్నారు. నాడు ఒక్క ఐటీనే యువత తల రాత మార్చిందని గుర్తు చేశారు. తలసరి ఆదాయం, జీవన ప్రమాణాలు పెరిగాయన్నారు. ఏఐ, క్వాంటమ్, డేటా సెంటర్లు వంటివన్నీ రాష్ట్రానికి వస్తున్నాయని పేర్కొన్నారు. 23 నెలల్లో రూ. 23 లక్షల కోట్ల పెట్టుబడులు, 23 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయని, ఎంవోయూలన్నీ పూర్తయితే ఇది సాధ్యమేనని చంద్రబాబు అన్నారు. ఏ ఆలోచన చేసినా, ఏ సంస్కరణ చేసినా యువత కోసమేనని చంద్రబాబు స్పష్టం చేశారు. సాధారణ రైతు బిడ్డ నుంచి ప్రతిఒక్కరికి ఐటీ రంగంలో అవకాశాలు వచ్చాయన్నారు. ఐటీ రంగంలో మన బిడ్డలు సాధించిన విజయాలు చూస్తే ఆనందంగా ఉందన్న చంద్రబాబు, నాటి విజన్ 2020 - నేటి స్వర్ణాంధ్ర 2047 యువత కోసమేనన్నారు. యువగళంలో ఇచ్చిన హామీల కంటే అధికంగా అమలు చేస్తామని వివరించారు.

### ఏకగ్రీవం అయితే సీరియస్‌గా
# తీసుకుంటా

**మొదటి పేజీ తరువాయి...**



చేశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన కీలక సమావేశంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కూటమి ప్రభుత్వం అధికార బలంతో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల ఓట్లను లక్ష్యంగా చేసుకుని తొలగించే అవకాశం ఉందన్నారు. ఇది కేవలం ఓటర్ల జాబితా మార్పు కాదు.. మన పార్టీ అస్తిత్వానికి, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల విజయానికి పునాది అని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం జూలై 24 నుంచి సెప్టెంబర్ 28 వరకు ఉన్న సమయాన్ని యుద్ధప్రాతిపదికన ఉపయోగించుకోవాలని జగన్ ఆదేశించారు. ఎక్కడ ఓటు తొలగింపునకు గురైనా తక్షణమే ఫామ్-7 ద్వారా రాతపూర్వక అభ్యంతరాలు తెలియజేయాలని, దీనికోసం నియోజకవర్గ స్థాయిలో పార్టీ లీగల్ సెల్ పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటుందని భరోసా ఇచ్చారు. అక్టోబర్ 1న విడుదలయ్యే తుది ఓటర్ల జాబితానే రాబోయే మున్సిపల్, కార్పొరేషన్ మరియు పంచాయతీ ఎన్నికలకు ప్రామాణికమని జగన్ స్పష్టం చేశారు. అక్టోబర్ 1 నాటికి మన ఒక్క ఓటు మిస్ అయినా వచ్చే ఐదేళ్ల రాజకీయంపై దాని ప్రభావం ఉంటుంది. అందుకే ప్రతి బూత్ ఇన్‌ఛార్జ్ తమ పరిధిలోని ఓట్లను క్షుణ్ణంగా తనిఖీ చేసుకోవాలి అని దిశానిర్దేశం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు పార్టీ భవిష్యత్తుకు అత్యంత కీలకమని, వీటిలో విజయం సాధించడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని జగన్ పిలుపునిచ్చారు. ఏకగ్రీవం అయితే సీరియస్ గా తీసుకుంటానని హెచ్చరించారు. చంద్రబాబు రెండేళ్ల పాలనపై 'వెన్నుపోటుకు రెండేళ్లు' పేరుతో వైసీపీ అధినేత వైఎస్ జగన్ బుక్ లెట్ విడుదల చేశారు. జూన్ 4 నుంచి 12 వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. జూన్ 4న మండల కేంద్రాల్లో నిరసనలు, 8 లేదా 9న నియోజకవర్గ కేంద్రాల్లో సదస్సులు, 12న ర్యాలీలు చేపట్టాలని వైఎస్సార్ సీపీ శ్రేణులకు సూచించారు. చంద్రబాబుది వెన్నుపోటు కాదని వెన్నుపోట్లని, ప్రజల నిరసనల సెగలు ఆయనకు తగలాలని హితబోధ చేశారు.

# కేరళలో రాజకీయ హైడ్రామా

**మొదటి పేజీ తరువాయి...**

నెలకొంది. కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ భారీ షాక్ ఇచ్చింది. బుధవారం తెల్లవారుజాము నుంచే తిరువనంతపురంలోని ఆయన అద్దె నివాసం, కన్నూర్‌లోని సొంత ఇల్లు సహా రాష్ట్రవ్యాప్తంగా 10కి పైగా ప్రాంతాల్లో ఈడీ ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. కొచ్చిన్ మినరల్స్ అండ్ రుటైల్ లిమిటెడ్ కేసులో మనీ లాండరింగ్ ఆరోపణలతో ఈ దాడులు జరగడం కేరళ రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. ఈ సోదాలకు ప్రధాన కారణం పినరయి విజయన్ కుమార్తె వీణా విజయన్ నడిపిన ఎక్సలాజిక్ సొల్యూషన్స్ సంస్థకు, సీఎం ఆర్ ఎల్ సంస్థకు మధ్య జరిగిన ఆర్థిక లావాదేవీలు. ఎలాంటి సేవలు అందించకుండానే వీణా సంస్థకు సీఎంఆర్ ఎల్ కు సుమారు రూ. 1.72 కోట్లు చెల్లించిందని ఆదాయపు పన్ను శాఖ మ, సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ గతంలోనే నివేదించాయి. దీనిపై మనీ లాండరింగ్ కోణంలో విచారిస్తున్న ఈడీ, తాజాగా విజయన్ , ఆయన అల్లుడు మొహమ్మద్ రియాస్ నివాసాల్లో కీలక పత్రాల కోసం సోదాలు చేపట్టింది. ఈడీ దాడుల వార్త తెలియగానే తిరువనంతపురంలోని విజయన్ నివాసం వద్దకు భారీగా సీపీఎం కార్యకర్తలు చేరుకున్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. సోదాలు ముగించుకుని బయటకు వస్తున్న ఈడీ అధికారుల వాహనంపై కార్యకర్తలు దాడికి దిగారు. వాహనంపై రాళ్లు, హెల్మెట్లు విసరడంతో కారు అద్దాలు ధ్వంసమయ్యాయి. పరిస్థితి చేయి దాటకుండా ఉండేందుకు అక్కడ మోహరించిన సీఆర్‌పీఎఫ్ బలగాలు కార్యకర్తలను అదుపు చేసే ప్రయత్నం చేశాయి.

**రాజకీయ కక్షసాధింపే: సీపీఎం**

ఈ దాడులను సీపీఎం తీవ్రంగా ఖండించింది. విపక్ష నేతలను లక్ష్యంగా చేసుకుని కేంద్రం తన దర్యాప్తు సంస్థలను ఆయుధాలు గా వాడుకుంటోందని ఆరోపించింది. రాజకీయంగా విజయన్‌ను ఎదుర్కోలేకనే ఇలాంటి దాడులకు దిగుతున్నారని పార్టీ జనరల్ సెక్రటరీ ఎం.ఏ. బేబీ విమర్శించారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ దాడులతో తమకు సంబంధం లేదని, హోం శాఖకు ముందస్తు సమాచారం లేదని స్పష్టం చేసింది. కేరళ హైకోర్టు ఈ కేసులో దర్యాప్తును ఆపలేమని స్పష్టం చేసిన మరుసటి రోజే ఈ దాడులు జరిగాయి. పినరయి విజయన్ , ఆయన కుటుంబ సభ్యులపై వస్తున్న ఈ ఆరోపణలు రాబోయే రాజకీయ పరిణామాలను ఎలా ప్రభావితం చేస్తాయనేది ఇప్పుడు కేరళలో హాట్ టాపిక్. కేంద్ర ఏజెన్సీల దూకుడుతో ఎల్డీఎఫ్ శ్రేణులు ఆందోళనలో ఉండగా, ప్రతిపక్షాలు మాత్రం చట్టం తన పని తాను చేసుకుపోతుందని పేర్కొంటున్నాయి.

# మహిళలకు 33 శాతం సీట్లు

**మొదటి పేజీ తరువాయి...**



ప్రతిపాదించారు. పార్లమెంట్ సమావేశాల్లో ప్రతిపక్షాలు మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకున్నాయని.. కానీ.. తెలుగుదేశం పార్టీ దానితో సంబంధం లేకుండానే మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించాలన్న చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని లోకేష్ తెలిపారు."మన స్త్రీశక్తికి మరింత బలం ఇవ్వాలని చూస్తే దానికి ప్రతిపక్షాలు అడ్డుపడ్డాయి. ఇప్పుడు ఒక ప్రతిపాదన చేస్తున్నాను. పార్లమెంట్ లో బిల్ పాస్ అయినా, అవ్వకపోయినా మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలి... వచ్చే ఎన్నికల్లో 33% సీట్లు మహిళలకు ఇవ్వాలి... ఈ పవిత్ర మహానాడు వేదిక నుండి తాను ఈ ప్రతిపాదన చేస్తున్నట్లు" నారా లోకేష్ ప్రకటించారు. మహిళా సాధికారతను టీడీపీ మాటల్లోనే కాదు చేతల్లో కూడా చూపుతుందని నారా లోకేష్ అన్నారు.ప్రతిపక్ష పార్టీలు ఈ బిల్లును తిరస్కరించి, మహిళా సాధికారతకు అడ్డంకులు సృష్టించడానికి ప్రయత్నించాయి. ఎన్నికల సమయంలో చాలా పార్టీలు మహిళా సాధికారత గురించి మాట్లాడతాయి... కానీ ఎన్నికల తర్వాత మహిళలను మర్చిపోతాయి. కానీ తెలుగుదేశం విధానం.. నినాదం రెండూ మహిళల అభ్యున్నతే అని చెప్పారు. తాను విద్యా శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే పాఠ్య పుస్తకాల్లో మహిళలు ఇంటి పనులు చేస్తున్నట్లుగా ఉన్న ఫోటోలను మార్చి.. మగవారు కూడా ఆ పనులు చేస్తున్నట్లుగా చూపించామని.. ఇంటి నుంచే మహిళలపై గౌరవం పెరగాలన్నది తమ సిద్ధాంతమని లోకేష్ తెలిపారు. రాష్ట్రంలో 2029 సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ మహిళలకు 33% సీట్లను కేటాయించాలని నిర్ణయించింది. మహిళా సాధికారితకు ప్రాధాన్యం ఇస్తూ తెలుగుదేశం పార్టీ తీసుకున్న అతి పెద్ద చారిత్రక ముందడుగు ఇదని లోకేష్ తెలిపారు. మహిళల అభ్యున్నతి మాటల్లో కాదని చేతల్లోనే చూపిస్తామని చెప్పారు. ."ఇది కేవలం ఒక నినాదంగా కాదు.. భారతదేశ భవిష్యత్తు పట్ల ఒక నిబద్ధతగా ఉండాలి. మాకు మరింత మంది మహిళా చట్టసభ సభ్యులు కావాలి... మరింత మంది మహిళా నాయకులు కావాలి... మరింత మంది మహిళా విధాన నిర్ణేతలు కావాలి. తెలుగుదేశం పార్టీ భవిష్యత్తును మహిళలు భుజం భుజం కలిపి నడిపిస్తారు. ఇది మా సంకల్పం...ఇది మా బాధ్యత...ఇది మా కమిట్ మెంట్" అని స్పష్టం చేశారు.

మహిళలకు పార్టీలో రిజర్వేషన్ కల్పించాలని తీర్మానించడం ద్వారా తెలుగుదేశం ఓ ముందడుగు వేసింది. మహిళలకు సంబంధించి చారిత్రక నిర్ణయాలు తీసుకోవడంలో ఆ పార్టీకి ఇంతకు ముందు కూడా ట్రాక్ రికార్డ్ ఉంది. ఎన్టీఆర్ మహిళలకు ఆస్తిహక్కు కల్పిస్తే.. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు విద్యాసంస్థల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించారు. ఇప్పుడు పార్టీ అభ్యర్థుల్లో 33శాతం రిజర్వేషన్ కల్పించడం ద్వారా టీడీపీ మరో ముందడుగు వేసింది.

# కర్ణాటక సీఎంగా డీకే..?

**మొదటి పేజీ తరువాయి...**

మార్పిడికి అధికారిక ముహూర్తంగా భావిస్తున్నారు. మంగళవారం ఢిల్లీలో కాంగ్రెస్ అధిష్ఠానంతో జరిగిన సుదీర్ఘ చర్చలు రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్ని మార్చేలా ఉన్నాయి. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీలతో జరిగిన విడివిడి భేటీల్లో.. సిద్ధరామయ్యకు గౌరవప్రదమైన వీడ్కోలు పలికేందుకు హైకమాండ్ సుముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం. ఆయనకు రాజ్యసభ సీటు ప్రతిపాదించినప్పటికీ, రాష్ట్ర రాజకీయాల్లోనే కొనసాగేందుకు సిద్ధరామయ్య మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. బుధవారం రాత్రి ఢిల్లీ నుంచి బెంగళూరు చేరుకోనున్న డీకే శివకుమార్, నేరుగా రేపు ఉదయం ముఖ్యమంత్రితో భేటీ కానున్నారు. ఈ సమావేశం ముగిసిన వెంటనే సిద్ధరామయ్య తన రాజీనామా నిర్ణయాన్ని ప్రకటించే అవకాశం ఉంది.

**2023 ఒప్పందం.. డీకే పట్టు**

2023 అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత సిద్ధరామయ్య, డీకే శివకుమార్ మధ్య కుదిరిన 'రెండున్నరేళ్ల ఫార్ములా' లేదా అధికార భాగస్వామ్య ఒప్పందాన్ని అమలు చేయాలని డీకే వర్గం మొదటి నుంచీ పట్టుబడుతోంది. కర్ణాటక పీసీసీ అధ్యక్షుడిగా పార్టీని గెలిపించిన తనకు ముఖ్యమంత్రి పీఠం దక్కాల్సిందేనని శివకుమార్ హైకమాండ్ వద్ద తన వాదనను బలంగా వినిపించారు. తాజా పరిణామాలు ఆయనకు సానుకూలంగా మారినట్లు కనిపిస్తోంది. బహిరంగంగా నాయకత్వ మార్పు అంశాన్ని కాంగ్రెస్ నేతలు ఖండిస్తున్నప్పటికీ, అంతర్గతంగా మాత్రం తీవ్రస్థాయిలో కసరత్తు జరుగుతోంది. "ప్రస్తుతానికి మా చర్చలన్నీ రాజ్యసభ, శాసనమండలి ఎన్నికల వ్యూహాల చుట్టూనే సాగాయి. మీడియాలో వస్తున్నవన్నీ ఊహాగానాలే" అని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పేర్కొన్నప్పటికీ, సిద్ధరామయ్య తన అనుచర మంత్రులతో జరిపిన డిన్నర్ మీటింగ్‌లో పదవి నుంచి తప్పుకుంటానని సంకేతాలివ్వడం గమనార్హం.



# రెండు భారతీయ భాషలు తప్పనిసరి

### 9, 10 తరగతుల్లో అమలు చేయాల్సిందే
### సీబీఎస్ఈ బోర్డు నిర్ణయంపై సుప్రీం ఆదేశాలు

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

కేంద్ర మాధ్యమిక విద్యా బోర్డు 9, 10 తరగతుల విద్యార్థులకు రెండు భారతీయ భాషలను తప్పనిసరి చేస్తూ తీసుకున్న నిర్ణయంపై స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు బుధవారం నిరాకరించింది. 2026 జూలై 1 నుంచి అమలులోకి రానున్న ఈ విధానాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను పరిశీలించేందుకు మాత్రం కోర్టు సుముఖత వ్యక్తం చేసింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ మేరకు సీబీఎస్ఈ, కేంద్ర ప్రభుత్వం, ఎన్‌సీఈఆర్‌టీ లకు నోటీసులు జారీ చేస్తూ, రెండు వారాల్లోపు సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. తదుపరి విచారణను జూలై 15, 16 తేదీలకు వాయిదా వేసింది. ఈ కొత్త విధానం అమలుకు సంబంధించి క్షేత్రస్థాయిలో ఉన్న సదుపాయాలు, సాధ్యాసాధ్యాలపై నివేదిక సమర్పించాలని అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటిని కోర్టు ఆదేశించింది. పిటిషనర్ల తరఫున సీనియర్ అడ్వకేట్ ముకుల్ రోహత్గీ వాదనలు వినిపిస్తూ.. సీబీఎస్ఈ జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులు మూడు భాషలు చదవాల్సి ఉంటుందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. మరో సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదిస్తూ.. "భాష అనేది వ్యక్తిగత ఎంపికకు సంబంధించిన అంశం. దాన్ని బలవంతంగా రుద్దలేరు. ఇది సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం" అని పేర్కొన్నారు.

**పరీక్షలు, ఇతర మార్పులు**

ఈ మూడవ భాషకు సంబంధించిన మూల్యాంకనం పూర్తిగా పాఠశాల స్థాయిలోనే (ఇంటర్నల్) జరుగుతుంది. అయితే ఈ మార్కులు సీబీఎస్ఈ సర్టిఫికేట్‌లో ప్రతిబింబిస్తాయి. భాషా పరంగానే కాకుండా, గణితం, సైన్స్ సబ్జెక్టులలో కూడా మార్పులు రానున్నాయి. వీటిలో 'స్టాండర్డ్', 'అడ్వాన్స్‌డ్' అనే రెండు స్థాయిలు ఉంటాయి. అందరికీ 80 మార్కుల సామాన్య పరీక్ష ఉంటుంది, కానీ లోతైన అవగాహనను పరీక్షించేందుకు అదనపు అడ్వాన్స్‌డ్ పేపర్‌ను ఎంచుకునే అవకాశం విద్యార్థులకు ఉంటుంది. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు నిబంధనల ప్రకారం మినహాయింపులు ఉంటాయని, విదేశాల నుంచి భారత్‌కు తిరిగి వచ్చే విద్యార్థుల విషయంలో కేసుల ఆధారంగా నిర్ణయం తీసుకుంటామని బోర్డు స్పష్టం చేసింది.

# ప్రక్షాళన రాజ్యాంగబద్ధమే

**మొదటి పేజీ తరువాయి...**

కూడా దాఖలయ్యాయి. దీనిపై సుప్రీం విచారణ చేపట్టింది. ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియ ఏ చట్టాన్ని లేదా రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘించలేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఎస్ ఐ ఆర్ అనేది కచ్చితమైన, సమగ్రమైన ఓటర్ల జాబితా దిశగా ఒక ముందడుగు అని, రాజ్యాంగానికి జీవం పోస్తుందని వ్యాఖ్యానించింది. ఎస్ ఐ ఆర్ ను వినియోగించడం ద్వారా ఎన్నికల సంఘం తన చట్టబద్ధమైన అధికారాలకు వెలుపల వ్యవహరించలేదని తెలిపింది. సాధారణంగా నిర్వహించే దానికి భిన్నంగా ఉన్నందున దీనిని అధికారాలకు అతీతమైనది అని చెప్పలేమంటూ కోర్టు వ్యాఖ్యానించింది. ఎస్ఐఆర్ ద్వారా సాధించాలనుకుంటున్న లక్ష్యానికి, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలనే రాజ్యాంగ లక్ష్యానికి ప్రత్యక్ష సంబంధం ఉందని తాము కూడా సంతృప్తిగా ఉన్నామంది. సుప్రీంకోర్టు ఈ తీర్పుతో ఎస్ఐఆర్ చుట్టూ గత ఏడాదిగా సాగుతున్న వివాదానికి ముగింపు పలికింది.

भारत निर्वाचन आयोग Election Commission of India

# రూ. 5కే చేపల కూర భోజనం

**మొదటి పేజీ తరువాయి...**

చేపను ఇప్పుడు రాజకీయ అస్త్రంగా మార్చుకున్నారు ముఖ్యమంత్రి సువేందు అధికారి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 400 ప్రత్యేక క్యాంటీన్లలో కేవలం రూ.5లకే చేప కూరతో కూడిన భోజనాన్ని అందించనున్నట్లు ఆయన ప్రకటించారు. గతంలో టీఎంసీ ప్రభుత్వం నడిపిన మా క్యాంటీన్ల తరహాలోనే, ఇప్పుడు మరింత ఆకర్షణీయంగా వారానికి రెండు రోజులు చేపలను మెనూలో చేర్చారు. ఎన్నికల ప్రచార సమయంలో బీజేపీ అధికారంలోకి వస్తే బెంగాలీలు చేపలు తినకుండా నిషేధం విధిస్తుంది అంటూ తృణమూల్ కాంగ్రెస్ చేసిన తీవ్ర విమర్శలకు ఈ పథకం ఒక గట్టి కౌంటర్‌గా కనిపిస్తోంది. తాము బెంగాలీ సంస్కృతికి వ్యతిరేకం కాదని, పేదవాడి ఆకలి తీర్చడంలో చేపల కూర భోజనం ఒక భాగమని సువేందు సర్కార్ నిరూపించే ప్రయత్నం చేస్తోంది. కేవలం భోజనమే కాకుండా, మహిళా ఓటర్లను ఆకట్టుకున్న అన్నపూర్ణ భండార్ గతంలో మాతృశక్తి భరోసా పథకం జూన్ 1 నుంచి అమలులోకి రానుంది. దీని కింద అర్హులైన మహిళలకు నెలకు రూ.3,000 చొప్పున నేరుగా వారి ఖాతాల్లో జమ చేయనున్నారు. గత ప్రభుత్వంలోని లక్ష్మీర్ భండార్ కంటే ఇది రెట్టింపు మొత్తం కావడంతో మహిళల్లో ఈ పథకంపై భారీ అంచనాలు ఉన్నాయి. బడ్జెట్ భోజనంతో పాటు రాష్ట్రంలో విద్యా సంస్థలు, ప్రార్థనా స్థలాల సమీపంలో ఒక కిలోమీటర్ మేర మద్యం విక్రయాలపై ఆంక్షలు విధిస్తూ సీఎం కీలక నిర్ణయం తీసుకున్నారు. అభివృద్ధి, సంక్షేమంతో పాటు నైతిక విలువలకు ప్రాధాన్యం ఇస్తామని ఆయన స్పష్టం చేశారు. సువేందు అధికారి తనదైన మార్కు రాజకీయాలతో బెంగాల్ ప్రజల మనసు గెలుచుకునే ప్రయత్నం చేస్తున్నారు. అప్పుల భారం ఉన్నప్పటికీ, ఇలాంటి భారీ సంక్షేమ పథకాలు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై ఎలాంటి ప్రభావం చూపుతాయనేది వేచి చూడాలి. అయితే, 'రూ.5 చేపల కూర భోజనం' మాత్రం సామాన్యుడికి పెద్ద ఊరటనిచ్చే అంశమే.

# మాడుగుల మండలంలో ప్రారంభమైన డిజిటల్ మహానాడు

**మాడుగుల, మే 26, జయ జయహే**

మాడుగుల నియోజకవర్గం లో బుధవారం ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో డిజిటల్ మహానాడు కార్యక్రమాలు క్లస్టర్ వారిగా ఘనంగా ప్రారంభమయ్యాయి. వాటిలో భాగంగా మాడుగుల మండలంలో గల మాడుగుల క్లస్టర్ 1 పరిధిలో షాది ఖానా లో జరిగిన డిజిటల్ మహానాడు కార్యక్రమంలో మాడుగుల శాసనసభ్యులు తనయుడు బండారు అప్పలనాయుడు, మాడుగుల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ దాసరి శ్రీనివాస్, మాజీ శాసనసభ్యులు గవి రెడ్డి రామానాయుడు, ఏఎంసి చైర్మన్ పుప్పాల అప్పలరాజు తదితరులతో పాటు ముఖ్య కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తొలిత బస్టాండ్ లో గల ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రారంభించిన డిజిటల్ మహానాడులో చంద్రబాబు నాయుడు లోకేష్ తోపాటు పార్టీకి చెందిన ప్రముఖుల ప్రసంగాలు ఆలకించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ కి అప్పలరాజు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణకు మారుపేరుని అన్న ఎన్టీఆర్ నుంచి మొదలుకొని చంద్రబాబు నాయుడు



నాయకత్వంలో ప్రస్తుతం యువ నాయకుడు లోకేష్ నాయకత్వంలోనూ పార్టీ ముందుకు క్రమశిక్షణతో సాగుతుందని చెప్పారు. పార్టీలు కూడా క్రమశిక్షణ గల కార్యకర్తలు పనిచేస్తున్నారని చెప్పారు. రానున్న స్థానిక ఎన్నికల దృష్టిలో పెట్టుకొని ప్రతి కార్యకర్త తమ గ్రామాల్లో పార్టీ విజయం సాధించే విధంగా కృషి చేయాలన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు పి లక్ష్మీ నారాయణ , మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పి రమేష్ తదితరులు కూడా పాల్గొనే మాట్లాడారు. అలాగే మండలంలో గల కేజే పురం, జేడీపేట క్లస్టర్లలో కూడా బి విజయలక్ష్మి, వడ్డే రాజ్ కుమార్ తదితరుల ఆధ్వర్యంలో కూడా డిజిటల్ మహానాడు కార్యక్రమంలో ఘనంగా జరిగాయి.




## మీ ప్రయాణాల్లో స్వీయ రక్షణ అవసరం

### పోలీస్ సహాయం కై తక్షణ కర్తవ్యం

**టెక్కలి మే 27 జయ జయహే**

మన ప్రయాణాలు అత్యవసర పనులపై ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన సమయంలో మార్గమధ్య రహదారుల్లో ఆకస్మిక ప్రమాదాలు , ఇతర ఏదైనా సంఘటనలు ఎదురైనప్పుడు మనం గురికాకుండా స్వీయ రక్షణ కోసం కొన్ని అత్యవసర సమాచారాలు మన హితవరులకు బంధువులకు అందని సమయములో తక్షణ మన కర్తవ్యం ఈ క్రింది నెంబర్లను ఉపయోగించడం వేను వెంటనే పోలీస్ శాఖ వారి సహాయం అందుకోవడం మన ప్రమాదాల నుంచి బయటపడేలా స్వీయ రక్షణ నిర్ణయాలు తీసుకోవలసిన అవసరం ఉంటుందని టెక్కలి సబ్ డివిజన్ శక్తి బృందం 4 గ్రామ ప్రాంతాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంది. శక్తి టీం ప్రతినిధులు పోలాకి మండలం కొత్త గడ్డ గ్రామంలో ఉపాధి హామీ పథకం కార్మికులు రైతులు తో స్వీయ రక్షణ కోసం పలు అంశాలపై ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రాంతంలో శక్తి బృందం అవగాహన సదస్సు నిర్వహించారు. ఏవైనా ఆకస్మిక ఇబ్బందులు ఏర్పడినప్పుడు చాలా జాగ్రత్తలు వహించాలని, యువత యువకులు ద్విచక్ర వాహన లైసెన్సులు, హెల్మెట్ ధరించి డ్రైవింగ్ చేయడం తప్పనిసరి అని, రహదారులు ప్రయాణించేటప్పుడు మద్యం సేవించరాదని, ముఖ్యంగా మహిళలు వారి స్వీయ రక్షణ కోసం ఈ క్రింది సహాయక నెంబర్లకు తక్షణమే ఫోన్ చేయాలని ఈ నెంబర్లు 1033,181,112,10311930,1098,1972 ఉచితంగా ఫోనులు పనిచేస్తాయని అందరూ పోలీస్ శాఖ సహాయాన్ని తక్షణమే తీసుకువచ్చని స్పష్టం చేశారు ఈ కార్యక్రమంలో శక్తి టీశీ ప్రతినిధులు ఏం గిరిధర్, వి భీమారావు, ధనలక్ష్మి, ఫీల్డ్ అసిస్టెంట్ పి నరేష్ స్వయం ఉపాధి హామీ కార్మికులు పాల్గొన్నారు.



## బక్రీద్ పండుగ ప్రశాంతంగా జరుపుకోవాలి: సీఐ తిలక్

**నిడదవోలు, జయజయహే ప్రతినిధి:**

నిడదవోలులో బక్రీద్ పండుగను ప్రశాంతంగా, సోదరభావంతో జరుపుకోవాలని సర్కిల్ ఇన్స్పెక్టర్ పీజీవీ తిలక్ పిలుపునిచ్చారు. బక్రీద్ సందర్భంగా శాంతి భద్రతల పరిరక్షణ, మత సామరస్యాన్ని కాపాడే లక్ష్యంతో నిడదవోలు సీఐ కార్యాలయంలో ముస్లిం పెద్దలు, మత పెద్దలు, యువకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి స్థానిక ముస్లిం సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.సమావేశంలో మాట్లాడిన సీఐ పీజీవీ తిలక్, పండుగ సమయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని, పరస్పర గౌరవంతో మత సామరస్యాన్ని కాపాడాలని కోరారు. ముఖ్యంగా సోషల్ మీడియాలో వ్యాపించే తప్పుడు ప్రచారాలు, అసత్య వార్తలను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే పోలీస్ శాఖకు సమాచారం అందించాలని తెలిపారు.బక్రీద్ పండుగ సందర్భంగా ప్రజల భద్రత కోసం పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందని సీఐ పేర్కొన్నారు. నిడదవోలు పట్టణంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసి, ముఖ్య ప్రాంతాల్లో అదనపు పోలీస్ సిబ్బందిని మోహరించనున్నట్లు వెల్లడించారు. ప్రజలు పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందించి ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవాలని కోరారు.ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన సీఐ తిలక్, ఆనందోత్సాహాలతో పాటు శాంతియుత వాతావరణంలో పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. సమావేశంలో పాల్గొన్న ముస్లిం పెద్దలు, యువకులు పోలీస్ శాఖ సూచనలకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. సమావేశం స్నేహపూర్వక వాతావరణంలో కొనసాగి మత సామరస్యానికి ప్రతీకగా నిలిచింది.

# కమనీయం కంబగిరీషుని కళ్యాణం

**సంజామల (జయ జయహే)**

సంజామల మండలం, పేరుసోముల గ్రామంలో వెలసిన సుప్రసిద్ధ క్షేత్రం శ్రీ కంబగిరి లక్ష్మీనారసింహస్వామి 16వ వార్షికోత్సవాలలో భాగంగా మూడవరోజు బుధవారం శ్రీ భూ సమేత నృశింహస్వామి కళ్యాణం నేత్రపర్వంగా సాగింది. ముందుగా గోమాతకు పూజానంతరం అహోబిలం క్షేత్ర పండితుడు కిడాంబి వేణుగోపాల్ బృందం నేతృత్వంలో కంబగిరి క్షేత్రం పీఠాధిపతులు శ్రీ రామ్మోహన్ స్వామి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిగినది. తిరుమల తిరుపతి దేవస్థానములు ప్రముఖ వ్యాఖ్యాత, ప్రవచనకర్త డాక్టర్ దీవి హయగ్రీవాచార్యుల కమనీయ వ్యాఖ్యానంతో, అన్నమాచార్య



ప్రాజెక్ట్ కళాకారుల సంగీతాలాపనలతో, నాదస్వర విన్యాసములతో, ఆద్యంతం భక్తుల ఆనందపారవశ్యాలతో ఈ కార్యక్రమం జరిగినది. మూడురోజులు ఇస్కాన్ ధర్మ



ప్రచారకులు శ్రీనిత్యతృప్తదాస్ స్వామిచే భగవద్గీత ప్రవచనాలు, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులచే సంగీతం, హరికథలు, కూచిపూడి, భరతనాట్యం మొదలైన కళావిన్యాసలతో క్షేత్రం భక్తిసాగరమైనది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాలనుండికూడా భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. భక్తాదులందరికి మహాప్రసాదం అందించారు.

# అనకాపల్లిలో ఘనంగా టెన్త్ టాపర్స్ అభినందన సభ

### రోలుగుంట జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు ప్రత్యేక సత్కారం -

### రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలు పి.వి.ఎం. నాగజ్యోతికి విశేష ప్రశంసలు

**అనకాపల్లి, మే 27:జయ జయ హే**

అనకాపల్లి పొట్టి శ్రీరాములు భవన్‌లో పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బుధవారం అభినందన సభ నిర్వహించారు. విద్యార్థుల్లో విద్య పట్ల ఆసక్తి, పోటీ స్ఫూర్తి పెంపొందించే లక్ష్యంతో నిర్వాహకులు ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.ఈ ఏడాది కూడా అనకాపల్లి పరిసర ప్రాంత ప్రభుత్వ పాఠశాలలతో పాటు పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రోలుగుంట విద్యార్థులను ప్రత్యేకంగా ఆహ్వానించి సన్మానించారు.




రోలుగుంట పాఠశాలకు చెందిన ఎం. శ్రీవాణి, బి. శిరీష, బి. జ్యోతి వరుసగా టాప్--1, టాప్--2, టాప్--3 స్థానాలు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకువచ్చారు.రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, రోలుగుంట జెడ్పీహెచ్ఎస్ ఆంగ్ల ఉపాధ్యాయిని పి.వి.ఎం. నాగజ్యోతి ప్రోత్సాహంతో ఆ పాఠశాల విద్యార్థులు గత కొన్నేళ్లుగా ఈ కార్యక్రమంలో పాల్గొంటూ ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు. గ్రామీణ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించి ఉన్నత లక్ష్యాల వైపు నడిపించడంలో ఆమె సేవలను నిర్వాహకులు ప్రశంసించారు.ఈ విద్యాసంవత్సరంలో ఆమె పాఠశాల లో ఆంగ్ల భాషలో విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించడంతో నాగజ్యోతి ని సభలో ప్రత్యేకంగా అభినందించి ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో వాసవి క్లబ్ ప్రతినిధులు, విద్యావేత్తలు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఫణిభూషణ్ శ్రీధర్ తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు. పొట్టి శ్రీరాములు భవన్ నిర్వాహకులు శ్రీ మూర్తి , వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ పి.వి. రమణమూర్తి చేతుల మీదుగా విద్యార్థులు, ఉపాధ్యాయులు సన్మానాలు అందుకున్నారు.



## సాంఘిక రుగ్మతలు రూపుమాపిన వ్యక్తి కందుకూరి

### ప్రజాస్వామిక ప్రగతిశీల భారతావనికి పునాది వేసిన మహనీయుడు నెహ్రూ

**భీమవరం : (జయ జయహే )**

మహిళలను చైతన్యపర్చేందుకు వారి విద్యకు కందుకూరి వీరేశలింగం పంతులు కృషి చేశారని, ప్రజాస్వామిక ప్రగతిశీల భారతావనికి పునాది వేసిన మహనీయులు జవహర్ లాల్ నెహ్రూ అని పలువురు వక్తలు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో భీమవరం వెంకట్రామ థియేటర్ ప్రాంగణంలో బుధవారం సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళారంజని నాటక పరిషత్ అధ్యక్షులు జవ్వాది శ్రీనివాస్, రచయిత కలిగొట్ల గోపాలశర్మ మాట్లాడుతూ వితంతు వివాహాల కోసం ఎన్నో కలుపు మొక్కలను ఏరిపారేసిన గొప్ప సైనికుడు కందుకూరి అని కొనియాడారు. శ్రీమావుళ్ళమ్మ దేవస్థాన ట్రస్ట్ సభ్యులు అరసవల్లి సుబ్రమణ్యం, డా ఎస్ సత్యనారాయణ రాజు, ఎన్ సీసీ మేజర్ ఏ వీరయ్య, తెలుగు పండితులు డిఆర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, సరైన విద్యతో మాత్రమే మెరుగైన సమాజాన్ని నిర్మించవచ్చునని, పరిపాలనాదక్షులుగా దూరదృష్టితో దేశాభివృద్ధికి ప్రణాళికలు అందించిన మార్గదర్శి నెహ్రు అని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ సాంఘిక రుగ్మతలు రూపుమాపారని, మహిళా విద్యకు ఎనలేని సేవ చేశారని, మూఢ నమ్మకాలను ప్రతిఘటించారన్నారు. భారత దేశ ప్రజాస్వామ్య మూలాలను బలోపేతం చేసిన సంస్థల నిర్మాత నెహ్రూ అని అన్నారు. కార్యక్రమంలో భట్టిప్రోలు శ్రీనివాసరావు, ఎస్ కే చాన్ భాషా, పి అమూల్య రావు, గంటా సుందర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## సోషల్ సైన్స్ లెక్చరర్లుగా ముగ్గురుకి పదోన్నతి

### కెజీహెచ్ లో నియామకం

**విశాఖపట్నం మే 27 (జయ జయహే )**

వైద్య ఆరోగ్య శాఖకు చెందిన ముగ్గురు ఉద్యోగులు పదోన్నతి పై సోషల్ సైన్స్ లెక్చరర్ లు గా కెజీహెచ్ విధులలో చేరారు. ఈమేరకు మంగళవారం సాయంత్రం వారు కెజీహెచ్ సూపరేంటెండెంట్ డాక్టర్ ఐ. వాణిని కలసి తమ నియామక ఉత్తర్వులు ను అందజేసిన వెంటనే విధుల్లో చేరారు. గాజువాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో మగ ఆరోగ్య విస్తరణ అధికారులుగా పని చేస్తున్న రొంగలి రవిశంకర్ బి. శ్రీనివాసా చార్యులు తో పాటు కెజీహెచ్ లోనే మహిళా ఆరోగ్య విస్తరణ ఆదికారిని గా పని చేస్తున్న ఎమ్. వెంకట లక్ష్మి లకు సోషల్ సైన్స్ లెక్చరర్ లు గా ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ రాధా రాణి మంగళవారం పదోన్నతి కల్పిస్తూ వారిని కెజీహెచ్ లో నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.దాంతో వారు అదేరోజు సాయంత్రం కెజీహెచ్ విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఏపీ గవర్నమెంట్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు నగేష్ పట్నాయక్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శేషు బాబు ఎన్ ఎం ఈ పీ సబ్ యూనిట్ సిబ్బంది అంతా వీరికి అభినందనలు తెలియజేశారు.

## త్యాగం, విశ్వాసం, సౌభ్రాతృత్వానికి ప్రతీకే బక్రీద్ పండుగ

### రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు

**అమరావతి, మే 27:(జయ జయహే )**




ఈద్ అల్–అజ్హా (బక్రీద్) పర్వదినం త్యాగం, భక్తి, మానవతా విలువలకు ప్రతీకగా నిలిచిన మహత్తర సందర్భంగా రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు పేర్కొన్నారు.పవిత్ర బక్రీద్ పండుగను పురస్కరించుకుని రాష్ట్రంలోని ముస్లిం సోదర సోదరీమణులకు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.బుధవారం విడుదల చేసిన ప్రకటనలో సానా సతీష్ బాబు మాట్లాడుతూ, ప్రవక్త ఇబ్రాహీం చూపించిన త్యాగనిరతి, దేవునిపై అచంచల విశ్వాసం ప్రపంచ మానవాళికి ఆదర్శమని అన్నారు. బక్రీద్ పండుగ మనుషుల మధ్య ప్రేమ, సౌభ్రాతృత్వం, పరస్పర సహకారం వంటి విలువలను మరింత బలపరుస్తుందని తెలిపారు.సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు ఐకమత్యంతో, పరస్పర గౌరవంతో జీవించాలని ఈ పండుగ మనకు సందేశం ఇస్తోందని పేర్కొన్నారు.దేశంలో శాంతి, సామరస్య వాతావరణం నెలకొని ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ, ప్రతి ఇంట ఆనందాలు వెల్లివిరియాలని రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు కోరుకున్నారు.

For a pure tomorrow.. జయహే

# హై పెర్ఫార్మర్ రాష్ట్రంగా తెలంగాణ

(సి.హెచ్.ప్రతాప్)



కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన జాతీయ లాజిస్టిక్స్ ర్యాంకింగ్స్ 'లీడ్స్-2025' నివేదికలో తెలంగాణ రాష్ట్రం 'హై పెర్ఫార్మర్'గా నిలిచి సరికొత్త రికార్డు సృష్టించింది. గతంలో 'అచీవర్' విభాగంలో ఉన్న రాష్ట్రం, ఇప్పుడు మరింత మెరుగైన స్థాయికి ఎదగడం పారిశ్రామిక రంగంలో తెలంగాణ సాధిస్తున్న ప్రగతికి నిదర్శనం. రాష్ట్ర ప్రభుత్వ దార్శనికత, ప్రైవేటు భాగస్వామ్యంతో చేపట్టిన సమన్వయ ప్రయత్నాల వల్లనే ఈ ఘనత సాధ్యమైందని ఆర్థిక విశ్లేషకులు భావిస్తున్నారు. మౌలిక వసతుల కల్పనలో వేగవంతమైన నిర్ణయాలు, పారిశ్రామిక ప్రోత్సాహకాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం ఈ విజయానికి ప్రధాన కారణాలుగా నిలిచాయి.

లీడ్స్-2025 నివేదిక ప్రకారం, లాజిస్టిక్స్ రంగంలో తెలంగాణ ఇతర రాష్ట్రాలకు గట్టి పోటీని ఇచ్చింది. హర్యానా, ఛత్తీస్‌గఢ్, బిహార్ వంటి రాష్ట్రాలతో సమానంగా నిలవడమే కాకుండా, మధ్యప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్ వంటి లాజిస్టిక్స్ పరంగా ఎంతో ముందున్న రాష్ట్రాల కంటే మెరుగైన ప్రదర్శన కనబరచడం విశేషం. ముఖ్యంగా రాష్ట్రంలోని జలమార్గాలను వినియోగించుకోవాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రశంసించింది. గోదావరి, కృష్ణా, భీమా, మంజీరా, తుంగభద్ర వంటి జాతీయ జలమార్గాలను సరుకు రవాణా కోసం ఉపయోగించుకోవడానికి సిద్ధం చేసిన కార్యాచరణ ప్రణాళికలు ఈ నివేదికలో ప్రముఖంగా ప్రస్తావనకు వచ్చాయి.

పారిశ్రామిక వాడలలో మౌలిక వసతుల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఈ గుర్తింపులో కీలక పాత్ర పోషించాయి. ప్రతి పారిశ్రామిక పార్కులో కనీసం ఐదు ఎకరాల భూమిని లాజిస్టిక్స్ అవసరాల కోసం కేటాయించడం, భారీ వేర్‌హౌసింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం వంటి విధానాలను కేంద్రం అభినందించింది. ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ పార్కులు, మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్కులు, ఇన్లాండ్ కంటైనర్ డిపోల ఏర్పాటు రాష్ట్ర పారిశ్రామిక ముఖచిత్రాన్ని మార్చివేస్తున్నాయి. నల్లగొండలో 750 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ పార్క్, మెదక్‌లో ప్రతిపాదించిన మల్టీ మోడల్ ప్రాజెక్టు, నిజామాబాద్ ఐసీడీ వంటివి భవిష్యత్తులో రవాణా ఖర్చులను గణనీయంగా తగ్గించి, సరుకు రవాణాను వేగవంతం చేస్తాయి.

కేవలం మౌలిక వసతులకే పరిమితం కాకుండా, మానవ వనరుల అభివృద్ధిపై కూడా రాష్ట్రం ప్రత్యేక దృష్టి సారించింది. 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ' ద్వారా లాజిస్టిక్స్, ఈ-కామర్స్ రంగాల్లో ప్రత్యేక కోర్సులను ప్రారంభించడం కేంద్రం దృష్టిని ఆకర్షించింది. మొదటి ఏడాదిలోనే 500 మందికి పైగా యువతకు ఈ రంగాల్లో శిక్షణ అందించడం విశేషం. వేర్‌హౌస్ మేనేజ్‌మెంట్, సప్లై చైన్ మేనేజ్‌మెంట్ వంటి విభాగాల్లో నైపుణ్యం పెంచడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని నివేదిక పేర్కొంది. రవాణా ఖర్చులు తగ్గడం వల్ల స్థానిక ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో గిరాకీ పెరిగి, రాష్ట్ర ఆర్థిక వృద్ధికి నూతన జవజీవాలు అందుతాయి.

తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న సాహసోపేత నిర్ణయాలు, పారదర్శకమైన పాలన, సాంకేతికత వినియోగం కలిసి ఈ ఘనతను సాధించిపెట్టాయి. ఈ గుర్తింపుతో రాష్ట్రానికి పెట్టుబడుల ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉంది. రవాణా వ్యవస్థలో ఉన్న అడ్డంకులను తొలగించడం ద్వారా వ్యాపార నిర్వహణ సులభతరం అవుతుంది. ఈ 'హై పెర్ఫార్మర్' హోదా తెలంగాణను దేశీయ లాజిస్టిక్స్ మ్యాప్‌లో ఒక కీలక కేంద్రంగా తీర్చిదిద్దింది. నైపుణ్య శిక్షణలో మరిన్ని పెట్టుబడులు పెట్టడం, మౌలిక వసతులను నిరంతరం ఆధునీకరించడం ద్వారా భవిష్యత్తులో తెలంగాణ దేశానికే లాజిస్టిక్స్ హబ్‌గా మారుతుందనడంలో సందేహం లేదు. క్షేత్రస్థాయిలో అమలవుతున్న పటిష్టమైన విధానాలే ఈ విజయానికి అసలైన సాక్ష్యం.

# స్వచ్ఛ ఓటరు జాబితాలే ప్రజాస్వామ్యానికి బలమైన పునాది

(సి.హెచ్.ప్రతాప్)


**భారతీయ ఎన్నికల కమిషన్ ఇటీవల ప్రవేశపెట్టిన ఎస్ఐఆర్ (సిస్టమాటిక్ ఐడెంటిఫికేషన్ అండ్ రివిజన్) కార్యక్రమం ప్రజాస్వామ్యానికి కీలకమైన ప్రతిపాదనగా నిలుస్తుంది. ఎన్నికల ప్రక్రియలో నిజమైన లక్ష్యాన్ని చేరుకోవడానికి, ప్రతి పౌరుడి రాజ్యాంగ హక్కును పరిరక్షించడానికి ఓటరు జాబితాల శుద్ధి అత్యంత అవసరం. ఓటరు జాబితాలు నిష్పక్షపాతంగా, ఖచ్చితంగా ఉండటం ద్వారా ప్రజల ఐక్యత పెరుగుతుంది. పాలకులపై నమ్మకం, ఎన్నికల పారదర్శకత బలపడతాయి.**



ఎస్ఐఆర్ ద్వారా ఓటరు జాబితాల్లో ఉండకూడని మృతుల పేర్లు తొలగించబడతాయి. ఒకే వ్యక్తి వివిధ ప్రాంతాల్లో నమోదు చేసుకున్న నకిలీ ఓట్లను, భౌతికంగా లేని ఓటర్ల పేర్లను తొలగించడం సాధ్యమవుతుంది. దీనివల్ల ఓట్ల గణనలో తప్పులు తగ్గి, అసలైన పోలింగ్ శాతం స్పష్టమవుతుంది. చాలా సందర్భాల్లో జరిగే అక్రమ ఓటింగ్, ఓటర్ల జాబితా తారుమారు వంటి అవకతవకలకు తప్పుడు రికార్డులే ప్రధాన కారణం అవుతున్నాయి. ఎస్ఐఆర్ ఈ లోపాలను పారదర్శక విధానంతో సరిచేసి, నాయకత్వ ఎంపికకు చక్కటి ఓటుదారుల ప్రతిబింబాన్ని అందిస్తుంది.

ఇలాంటి ఓటరు జాబితాల శుభ్రత స్థానిక రాజకీయ ఒత్తిళ్ల నుండి సామాన్య ప్రజల హక్కులను రక్షిస్తుంది. కుటుంబ వివరాల్లో మార్పులు, నివాస సమాచారంలో పొరపాట్లు, పేరు లేదా చిరునామా తప్పుల వల్ల నిజమైన ఓటర్లు ఓటు హక్కు కోల్పోయి నిరాశకు గురవుతున్నారు. ఎస్ఐఆర్ ద్వారా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉండే స్థానికతను విస్తృతంగా పరిశీలించి, సమాచారాన్ని ఆధునిక డిజిటల్ డేటాబేస్‌లతో అనుసంధానిస్తారు. ఫలితంగా అర్హులైన వాస్తవ ఓటదారులు మాత్రమే ఎన్నికల్లో పాల్గొనే అవకాశం లభిస్తుంది.

ఎన్నికల న్యాయ విధానాలపై ప్రజల విశ్వాసం పెరగడానికి ఇది దోహదపడుతుంది. ప్రజాస్వామ్య వ్యవస్థ వర్ధిల్లడానికి ప్రజలు నమ్మకంగా ఓటు వేయగలిగే వాతావరణం అవసరం. ఎస్ఐఆర్ ప్రక్రియలో పత్రాల ఆధారాలు, సమాచారాన్ని సురక్షితంగా పరిశీలించడం ద్వారా పక్షపాతం లేదా ఓటర్ల ప్రామాణికతపై ఉండే అనుమానాలు తొలగిపోతాయి. ఇది రాజకీయ పార్టీలు, అభ్యర్థుల మధ్య సమాన అవకాశాలను కల్పించే మార్గాన్ని సుగమం చేస్తుంది.



సమర్థవంతమైన సాంకేతికతను, డేటా శుద్ధి విధానాలను నిరంతరం వినియోగించకపోతే చేపట్టిన చర్యలు తాత్కాలికంగా మాత్రమే మిగిలిపోతాయి. ఎన్నికల కమిషన్ ఈ కార్యక్రమాలను ప్రజా బాహుళ్యంలోకి తీసుకెళ్లాలి. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సమాచార సదుపాయాలు కల్పించి, క్షేత్రస్థాయి బృందాల ద్వారా పారదర్శకంగా అమలు చేస్తేనే దీర్ఘకాలిక ప్రయోజనాలు సాధ్యమవుతాయి. ఓటర్ల నమోదు ప్రక్రియను నిరంతరంగా పర్యవేక్షించడం ద్వారానే వ్యవస్థాగత మార్పు వస్తుంది.

ఎస్ఐఆర్ కార్యక్రమం ఓటరు జాబితాల శుద్ధి దిశగా ఒక స్పష్టమైన, బాధ్యతాయుతమైన అడుగు. ఇది ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే ఉత్తమ విధానం. నిజమైన ఓటర్లే ప్రజాస్వామ్య వ్యవస్థకు అసలైన పునాది. ఇలాంటి సంస్కరణలకు మద్దతు ఇస్తూ, ఓటరు జాబితా నమోదు, సవరణ ప్రక్రియలో ప్రజలు క్రియాశీలకంగా పాల్గొనడం సమాజ ప్రగతికి ఎంతో అవసరం. ఓటు హక్కు సద్వినియోగం కావాలన్నా, ప్రజాస్వామ్య విలువలు నిలబడాలన్నా స్వచ్ఛమైన ఓటరు జాబితా మాత్రమే ఏకైక మార్గం. అర్హత గల ప్రతి పౌరుడు ఈ ఓటరు నమోదు, పరిశీలన ప్రక్రియలో భాగస్వామ్యం కావడం ద్వారానే ఎన్నికల వ్యవస్థ పటిష్టమవుతుంది. కేవలం చట్టాలు, నిబంధనలు మాత్రమే కాకుండా, ప్రజల్లో వచ్చే చైతన్యమే నిజమైన ప్రజాస్వామ్య విజయానికి నాంది పలుకుతుంది. ఓటరు జాబితా పారదర్శకత దేశ భవిష్యత్తును నిర్ణయిస్తుంది.

## అమ్మ హృదయం నుండి ఉద్భవించిన

# ఆత్మ పుష్పం మందారం!

(పుట్ల శ్రీనివాసరావు)

**ఆధ్యాత్మికం ప్రకారం మందార పువ్వు ఒక దైవిక జననం! మన పూజా విధానంలో మందార పువ్వు కాళికా దేవికి, దుర్గామాతకు, వినాయకునికి ఎంతో ప్రీతికరమైనది. దీని గాఢమైన ఎరుపు రంగు, విశ్వానికి ఆదిశక్తి అయిన అమ్మవారి ఉగ్రత్వాన్ని, అలాగే ఆమె అనంతమైన కరుణను సూచిస్తుంది. కాళికా దేవి ఉగ్రతాండవం చేస్తున్నప్పుడు ఆమె పాదాల నుండి చిమ్మిన కాంతి కిరణాలే భూమిపై మందార పువ్వులుగా జన్మించాయని ఒక ఆధ్యాత్మిక సంకేతం ఉంది!**



సిద్ధులు తమ ఆత్మ బలాన్ని పెంపొందించుకోవడానికి మందార పువ్వును ఎక్కువగా ఉపయోగించేవారు. మన తల పైభాగంలో ఉండే 'బ్రహ్మరంధ్రం' అనే శక్తి కేంద్రాన్ని (చక్రాన్ని) వికసింపజేసే శక్తి ఈ మందారానికి ఉంది.

భవిష్యోత్తర బ్రహ్మాండ పురాణం'లో ఒక ఆసక్తికరమైన సమాచారం ఉంది. అంబికా దేవికి 108 మందార పువ్వులతో మాల కట్టి సమర్పించి పూజిస్తే, వారి వంశం అరటి చెట్టులా అంచలంచెలుగా, తరతరాలుగా వంశ వృద్ధి చెందుతుందని చెప్పబడింది.

మందార మొక్క గింజల ద్వారా వ్యాప్తి చెందదు. దాని చిన్న కొమ్మను కత్తిరించి మట్టిలో నాటినా అది వేర్లు తొడిగి కొత్త జీవంగా పుడుతుంది.

ప్రకృతికి ఉన్న ఈ 'పునరుత్పత్తి సామర్థ్యాన్ని' సిద్ధులు మానవ శరీరంలోని శక్తిని మార్చే ప్రక్రియకు ప్రతీకగా చెప్పారు.

సూర్యుని లాంటి ప్రకాశవంతమైన ఎరుపు రంగును కలిగి ఉండటం వల్ల సంస్కృతంలో దీనికి 'జపా పుష్పం' అని పేరు వచ్చింది. ఆదిత్య హృదయ స్తోత్రంలో కూడా సూర్యుడిని ఈ పువ్వుతోనే పోలుస్తారు.

ఒక పువ్వు మన వంశాన్ని వృద్ధి చేయగలదా? మీ అభిప్రాయం ఏమిటి?

గ్రామ పరిరక్షణ, వ్యాధుల నుండి రక్షణ, పంటల సమృద్ధికోసం చేసే ప్రత్యేక ఆరాధన

ఊరిని భూతప్రేతాలు, అంటువ్యాధులు, గాలిధూళి నుండి కాపాడటం

గ్రామ పొలిమేరలలో ఊరి చివరన కాపుకాస్తూ భూత ప్రేతాలు రాకుండా కాపాడుతుంది

అమ్మవారి రూపంలో పసుపు, కుంకుమ, గాజులు, రవికెలు, పువ్వులు, ధూపదీప నైవేద్యాలు

చద్ది ఆహారం, స్వయంగా చేసిన అన్నం, పంటలో కొంత భాగం గ్రామదేవతలకు సమర్పిస్తారూ

గ్రామ దేవతలకు పెద్ద స్తోత్రాలు, క్లిష్ట పూజా తంతులు అవసరం లేదు భక్తితో, ప్రేమతో పిలిస్తే చాలు"యద్భావం తద్భవతి" అన్నట్లు మన భావానుసారం కోరికలు నెరవేరుస్తాయి ఇది సాక్షాత్తు జగదాంబ ఆరాధనే.



# సమస్యలు చెప్పండి పవన్ దృష్టికి తీసుకెళ్తా..

## ఉపాధి కూలీలతో జనసేన రాజు

చోడవరం 26 జయ జయహే

చోడవరం నియోజక వర్గ పరిధిలోగల రోలుగుంట మండలం బుచ్చెంపేట రావణాపల్లి జలాశయం పరీవాహక ప్రాంతంలో జరుగుతున్న ఎన్ఆర్ఈజీఎస్ పనులలో పనిచేస్తున్న బుచ్చెంపేట గ్రామస్తులను బుధవారం చోడవరం జనసేన పార్టీ ఇంచార్జ్ పివివిఎస్ఎన్ రాజు పార్టీ నాయకులతో కలసి నేరుగా కలిశారు. వారికి సంబంధించిన పలు విషయాలను రాజు అడిగి తెలుసుకున్నారు. వారికి ఇలాంటి ఇబ్బందులు ఉన్న తనకు తెలియజేయాలని పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి అందరికీ మంచి చేకూరే విధంగా పనులు చేయిస్తామని అన్నారు. ఈ సందర్భంగా రోలుగుంట మండల వీర మహిళ అధ్యక్షురాలు మహేశ్వరి రమణ సమకూర్చిన 1000 మజ్జిగ ప్యాకెట్లను ఇప్పటి శ్రామికులకు పంపిణీ చేశారు. అలాగే బుచ్చెంపేట ప్రభుత్వ హైస్కూల్లో 543 మార్కులతో ప్రథమ స్థానం సాధించిన నడిపింటి భాగ్యశ్రీ ని అభినందిస్తూ తనకి చిరుసన్మానం చేస్తూ మహేశ్వరి రమణ 1000 రూపాయల నగదును తనకి ప్రోత్సాహంగా అందజేశారు. తదుపరి గ్రామానికి చెందిన ఉలభాల రాజు వైద్య కారణాలతో చికిత్స చేయించుకున్నందున వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరు కాబడిన 92,000 రూపాయల చెక్కును వారికి అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేసిన అనిమిరెడ్డి మహేశ్వరుని రాజు అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు జానకిరామపురం పిఎసిఎస్ చైర్మన్ బలిజి మహారాజు, రోలుగుంట మండల ప్రోగ్రాం కమిటీ చైర్మన్ లాలం నర్సింగరావు, పార్టీ నాయకులు అర్పి త్రినాధం, గాలి బాలరాజు , బుంగా కోటి బాబు, కేసరపూడి శివాజి, దిమిలి సత్య, శిరసపల్లి శివ, చింతల కిషోర్ కలం మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# కాక్‌రోచ్ జనతా పార్టీ పుట్టుక మరియు భవిష్యత్

అన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో, యూట్యూబ్ ఛానల్ లలో అనుకూల, అననుకూల చర్చలకు దారి తీస్తున్న కాక్‌రోచ్ జనతా పార్టీ గురించి ఈ శీర్షికలో పరిశీలిద్దాం. కాక్‌రోచ్ జనతా పార్టీ గురించి తెలుసుకోవలసిన అవసరం భారతీయులం అయిన మన అందరిపైనా ఉంది ఎందుకంటే కేవలం 72 గంటల్లో ఒక లక్ష అనుచరులను ఈ ఆన్లైన్ పార్టీ సంపాదించుకుంది అంటే అది సామాన్యమైన విషయం కాదు. ఇదేదో పెద్ద సినిమా స్టారో, క్రీడాకారుడో, లేదా ఏదైనా రాజకీయ పార్టీనో సృష్టించిన ఆన్లైన్ అకౌంట్ కాదు. ఎవరో ఒక అపరిచితుడు ప్రారంభించిన ఆన్లైన్ ఉద్యమానికి ఇంత తక్కువ వ్యవధిలో, ఇంత మంది ఎక్కువ మంది మద్దతు పలుకుతున్నారంటే, చాలా తీవ్రంగా ఆలోచించాల్సిన విషయమే. ఠ (ట్విట్టర్) సంస్థ ఈ అకౌంట్ ని సస్పెండ్ చేసింది అంటే, ఈ ఉద్యమ తీవ్రత యే స్థాయికి చేరుకుందో, చేరుకోబోతుందో అనే భయాందోళనలు పాలకుల్లో పుట్టాయి అంటే మనం బాగా ఆలోచించాల్సిన విషయమే ఇది.




### నేపథ్యం

2026 మే 15న భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీశాయి. సుప్రీంకోర్టులో జరిగిన ఒక విచారణ సందర్భంగా, ఒక పిటిషనర్ న్యాయవాదిని తీవ్రంగా మందలిస్తూ ఆయన చేసిన మౌఖిక వ్యాఖ్యలు పెద్ద వివాదంగా మారాయి. ముఖ్యంగా ఉద్యోగాలు దొరకని కొందరు యువకులు మీడియా, సోషల్ మీడియా, ఆర్‌టీఐ కార్యకర్తలుగా మారి "వ్యవస్థపై దాడి చేస్తున్నారు" అని వ్యాఖ్యానించడం తీవ్ర అభ్యంతరాలకు కారణమైంది. అంతేకాకుండా అలాంటి వారిని "పరాన్నజీవులు"గా పేర్కొంటూ "బొద్దింకలు"తో పోల్చడం ప్రజల్లో ఆగ్రహాన్ని రేకెత్తించింది.

ఈ వ్యాఖ్యలు వెలుగులోకి వచ్చిన వెంటనే దేశవ్యాప్తంగా యువత, న్యాయవాదులు, సామాజిక కార్యకర్తలు మరియు పౌరసంఘాల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. నిరుద్యోగంతో ఇప్పటికే ఇబ్బందులు పడుతున్న యువతను అవమానించేలా దేశ అత్యున్నత న్యాయస్థానాధిపతి మాట్లాడటం సమాజంలో తీవ్ర మనస్తాపాన్ని కలిగించింది. ముఖ్యంగా సామాజిక మాధ్యమాల్లో ఈ వ్యాఖ్యలపై వ్యంగ్యాలు, నిరసనలు, విమర్శలు విస్తృతంగా చర్చకు వచ్చాయి.

విమర్శలు పెరుగుతున్న నేపథ్యంలో, ప్రధాన న్యాయమూర్తి తన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని వివరణ ఇచ్చారు. తాను నిరుద్యోగ యువతను ఉద్దేశించి మాట్లాడలేదని, నకిలీ డిగ్రీలతో న్యాయవృత్తిలోకి ప్రవేశించి వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్న వ్యక్తుల గురించే వ్యాఖ్యానించానని తెలిపారు. యువత దేశ భవిష్యత్తుకు స్తంభాలంటూ ఆయన స్పష్టం చేశారు.

అయితే అప్పటికే జరిగిన నష్టం చాలా లోతుగా ప్రజల మనసుల్లో ముద్రపడిపోయింది. ముఖ్యంగా యువతలో ఈ వ్యాఖ్యలు అవమానభావనను మిగిల్చాయి. అదే ఆగ్రహం, అదే వ్యంగ్యం చివరకు ఆన్‌లైన్ ప్రపంచంలో కొత్త రాజకీయ వ్యంగ్య ఉద్యమానికి రూపం ఇచ్చింది. "కాక్‌రోచ్ జనతా పార్టీ" పేరుతో సోషల్ మీడియాలో ఒక వ్యంగ్య రాజకీయ వేదిక ఆవిర్భవించింది.

"కాక్‌రోచ్ జనతా పార్టీ" పేరుతో ఏర్పడిన ఈ ఆన్‌లైన్ ఉద్యమం వ్యవస్థ చేత తక్కువగా చూడబడుతున్న నిరుద్యోగ యువత, ఆర్‌టీఐ కార్యకర్తలు, స్వతంత్ర జర్నలిస్టులు, సోషల్ మీడియా వేదికలలో గొంతెత్తుతున్న ప్రజల భావోద్వేగాలకు ప్రతీకగా మారింది. "మమ్మల్ని బొద్దింకలుగా పిలిచినా, మేమే వ్యవస్థలోని చీకట్లను బయటపెడతాం" అనే నినాదాలతో ఈ ఉద్యమం వైరల్ అయింది.

సామాజిక మాధ్యమాల్లో వ్యంగ్య పోస్టులు, మీమ్స్, డిజిటల్ పోస్టర్లు, ప్రత్యామ్నాయ రాజకీయ నినాదాలతో "కాక్‌రోచ్ జనతా పార్టీ" వేగంగా ప్రజాదరణ పొందుతోంది. ఇది కేవలం ఒక ట్రోల్ ఉద్యమమా? లేక యువతలో పెరుగుతున్న అసంతృప్తికి ప్రతిబింబమా? అన్న చర్చ ఇప్పుడు దేశవ్యాప్తంగా సాగుతోంది.

### పార్టీ పుట్టుక

"కాక్‌రోచ్ జనతా పార్టీ" అనేది రాజకీయ వ్యంగ్యాన్ని ప్రధాన సిద్ధాంతంగా తీసుకుని 2026 మే 16న అంటే భారత సర్వోన్నత న్యాయస్థానం యొక్క ప్రధాన న్యాయమూర్తి నిరుద్యోగ యువతను వ్యంగంగా వ్యాఖ్యానించిన మరుసటి రోజే, దీనిని ఒక ఆన్‌లైన్ రాజకీయ వ్యంగ్య ఉద్యమంగా అభిజీత్ దిప్కే స్థాపించాడు. ఈ పార్టీకి వ్యవస్థాపకుడు మరియు అధ్యక్షుడు ఇద్దరూ అభిజీత్ దిప్కేనే. "సోమరులు మరియు నిరుద్యోగుల గొంతుక" (ఎశీఅఎివ శీట్ ష్తవ ాఖఓఎ డ ఖఅవఎజూశ్రీశీఎవస) అనే నినాదంతో యువతలో చర్చనీయాంశంగా మారిన ఈ వేదిక ప్రస్తుతం భారత ఎన్నికల సంఘం వద్ద నమోదు కాలేదు. సామాజిక మాధ్యమాల్లో వ్యంగ్య రాజకీయ ప్రచారాలు, మీమ్స్, నిరసన పోస్టులతో ఈ పార్టీ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంటోంది.

ప్రస్తుతానికి, అభిజీత్ దీప్కే స్థాపించిన ఆన్లైన్ (రాజకీయ) పార్టీగా మాత్రమే ఉంది. ఇది ప్రస్తుతం ఒక మీమ్ పేజ్ గా, మీమ్ పార్టీగా మాత్రమే పరిగణింపబడుతుంది.

### రాజకీయ పార్టీగా మనుగడ: సాధ్యాసాధ్యాలు

ఒక మీమ్ పార్టీగా ఉన్న కాక్‌రోచ్ జనతా పార్టీ ఒక సాధారణ రాజకీయ పార్టీగా మారడానికి, మనగలగడానికి గల సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తే, మనకు కొన్ని ఆశక్తికరమైన విషయాలు తెలుస్తాయి.

ఈ ఊహాజనిత పార్టీ యొక్క మనుగడ దేశంలో ఉన్న ప్రభుత్వంపై, ప్రభుత్వరంగ వ్యవస్థల పనితీరుపై అసంతృప్తులపై ఆధారపడి ఉంది. ఈ అసంతృప్తులను ప్రధానంగా రెండు రకాలుగా విభజించవచ్చు: 1. వ్యక్తిగతమైనవి, 2. రాజకీయ పార్టీల పట్ల గల అభిమాన పరమైనవి.

నిరుద్యోగులు, వ్యవస్థల వలన, రాజకీయ నాయకుల వలన నిరాదరణకు, వివక్షకు లేదా దగాకు గురయినవారు వ్యక్తగత అసంతృప్తుల కోవలోకి వస్తారు. రెండవ వర్గం వారు 'తమ అభిమాన పార్టీలు అధికారాన్ని కోల్పోతున్నాయి అనే బాధ ఒకటైతే, తమకు ఇష్టంలేని వాళ్ళు అధికారంలో ఉంటున్నారు అనే ఆక్రోశం' కలవారు. వీళ్ళు తమ అభిమాన పార్టీ అధికారంలో లేకపోయినా సరే ప్రస్తుతం అధికారంలో ఉండకూడదు అనే మానసిక స్థితిలో ఉంటారు. పై రెండు వర్గాలు వారు ప్రస్తుత ప్రభుత్వానికి, పాలనికి బద్ద వ్యతిరేకులై ఉంటారు.

ప్రస్తుతం మన దేశంలో అంచనాగా 36 కోట్ల (20–35) మంది యువకులు ఉన్నారు. వీరందరూ కాక్‌రోచ్ జనతా పార్టీకి మద్దతు ఇస్తారని చెప్పలేము అలా అని ఇవ్వరని చెప్పలేము. అయితే, భారత ప్రభుత్వం లేదా ప్రభుత్వ సంస్థలు ప్రకారం కేవలం ఏడూ కోట్ల అరవై మూడు లక్షల మంది మాత్రమే నిరుద్యోగులు ఉన్నారు. కానీ, ఇరవై కోట్ల అరవై లక్షల మంది నుంచి ఇరవై రెండు కోట్ల రెండు లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారని స్వతంత్ర సంస్థల అంచనా. లెక్క ఎంతైనా వీరికి తోడు వాళ్ళ కుటుంబ సభ్యులు కూడా వీళ్ళతో జతకలుస్తారు. కేవలం, యువత, నిరుద్యోగులు అని మాత్రమే కాదు పెద్ద వయస్కులు కూడా ఈ పార్టీకి మద్దతు తెలపవచ్చు.

రాజకీయ వ్యంగ్య ఉద్యమంగా ప్రారంభమైన "కాక్‌రోచ్ జనతా పార్టీ" ఇన్‌స్టాగ్రామ్‌లో ఇప్పటికే 2 కోట్లకు పైగా ఫాలోవర్లను సంపాదించింది. ఈ ఫాలోవర్ల సంఖ్య భారతీయ జనతా పార్టీ ఫాలోవర్ల కంటే ఎక్కువ మరియు కేవలం రెండు మూడు రోజుల వ్యవధిలోనే వీళ్లంతా చేరిపోయారు అంటే ప్రస్తుత పాలన పట్ల, వ్యవస్థల పట్ల యువతలో ఎంత విసుగు, అపనమ్మకం ఉందో మనకు అర్థమౌవుతింది. అభిజీత్ దిప్కే స్థాపించిన ఈ +వఅ్గ కేంద్రిత ఉద్యమం డిజిటల్ ప్రపంచంలో వేగంగా విస్తరించగా, ప్లాట్‌ఫామ్ గణాంకాల ప్రకారం దాని ప్రేక్షకుల్లో 94 శాతం మందికి పైగా భారతదేశానికి చెందినవారే ఉన్నారు.

ఒక మీమ్ పార్టీగా మాత్రమే ఉన్నప్పటికీ సీజేపీ తాత్కాలిక మేనిఫెస్టోను తన ఇంస్టాగ్రామ్లో క్రింది విధంగా పొందుపరిచింది

**మేనిఫెస్టో:**

1. రిటైర్మెంట్ తరువాత న్యాయమూర్తులకు రాజ్య సభ సీట్ ఇవ్వవం
2. అన్యాయంగా ఓటు ను తీసేస్తే ప్రధాన ఎన్నికల అధికారిని అరెస్ట్ చేస్తాం.
3. చట్ట సభలలో 50% సీట్లు మహిళలకు కేటాయింపు.
4. అంబానీ, అదానీ లచే నిర్వహింపబడుతున్న అన్ని రకాల మీడియాల లైసెన్స్ లను రద్దు చేస్తాం.
5. పార్టీ ఫిరాయంపు రాజకీయ నాయకులను 20 ఏళ్ళు రాజకీయ బహిష్కరణ.

ఈ మేనిఫెస్టో కేవలం నిరుద్యోగులను మాత్రమే కాకుండా పెద్దలను, వివిధ రంగాలలో ప్రముఖాలను కూడా ఆకర్షిందొంది. ప్రముఖ సుప్రీమ్ కోర్ట్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్, డా. నీరజ్ బంకర్, మహేష్ అడ్మన్కర్ వంటి చరిత్రకారులు, శశీ థరూర్ వంటి మేధావులు ఈ ఉద్యమానికి స్పందిస్తూ, ప్రభుత్వం నిరుద్యోగ యువత మనోభావాలను అర్థం చేసుకొని తగిన చర్యలు చేపట్టకపోతే, తగిన మూల్యం చెల్లించుకోవలసి ఉంటుందని పేర్కొన్నారు.

కాక్‌రోచ్ జనతా పార్టీ తన ఆంథమ్ లో మరికొన్ని ముఖ్య అంశాలను పోందుపర్చింది. అవి ఏమిటో చూద్దాం.

1. మమ్మల్ని బొద్దింకలని పిలిచినా, మేమే వ్యవస్థలో బతికే నిజమైన ప్రజలం
2. నిరుద్యోగ యువత గొంతుక మేమే
3. వ్యంగ్యమే మా ఆయుధం, ప్రశ్నించడమే మా హక్కు
4. అవినీతి, అహంకార రాజకీయాలకు వ్యతిరేకమే మా పోరాటం
5. సోషల్ మీడియానే మా సభ, మీమ్సే మా పోస్టర్లు
6. భయపడని యువతే కొత్త రాజకీయ శక్తి
7. ఉద్యోగం, గౌరవం, స్వేచ్ఛ ప్రతి యువకుడి హక్కు
8. ప్రజలను తక్కువగా చూసే వ్యవస్థను ప్రశ్నిస్తాం
9. "సోమరులు" కాదు, అవకాశాలు కోల్పోయిన తరం మేము
10. మార్పు కోసం నవ్వుతూ చేసే తిరుగుబాటే మా సిద్ధాంతం

ఈ అంశాలు దేశంలోని యూవతని విపరీతంగా ఆకర్షించాయి.

పాలకలనుంచి, ప్రభుత్వ శాఖలనుంచి సరయిన స్పందన సకాలంలో రాకపోతే తీవ్ర పరిణామాలను ఎదుర్కొనే పరిస్థితుల రావొచ్చు. ఇటీవల కాలంలో మన పొరుగు దేశాల్లో జరిగిన ఉదాంతాలే పెద్ద ఉదాహరణలు.

మన ఇరుగు పొరుగు దేశాల్లో జరిగిన ఉద్యమాలను ఒకసారి పరికిద్దాం.

నేపాల్‌లో జెన్ కిడ్స్, యువత ఆధ్వర్యంలో జరిగిన ప్రజా ఉద్యమాలు దేశ రాజకీయ వ్యవస్థను గణనీయంగా మార్చాయి. ముఖ్యంగా రాజ్యపాలనవ్యతిరేక ఆందోళనలు, అవినీతి వ్యతిరేక నిరసనలు, ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమాల్లో యువత కీలక పాత్ర పోషించింది. సోషల్ మీడియాను ఆయుధంగా మార్చుకున్న కొత్త తరం పాత రాజకీయ పార్టీలపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తూ వీధుల్లోకి దిగింది. ఈ ఉద్యమాల ఫలితంగా ప్రభుత్వాలు కూలిపోయాయి, రాజ్యపాలన ప్రభావం తగ్గింది, ప్రజాస్వామ్య వ్యవస్థ బలపడింది. పారదర్శక పాలన, యువతకు అవకాశాలు, అవినీతి నిర్మూలన, స్వేచ్ఛాయుత సమాజం వంటి మార్పులను కోరిన ఈ తరం, నేపాల్ రాజకీయాల్లో కొత్త చైతన్యాన్ని తీసుకొచ్చింది.

బంగ్లాదేశ్‌లో యువత, విద్యార్థి సంఘాలు మరియు పౌర సమాజం కలిసి పలు కీలక ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించాయి. ముఖ్యంగా అవినీతి, నియంతృత్వ ధోరణులు, నిరుద్యోగం, ఎన్నికల పారదర్శకత లేకపోవడంపై పెద్దఎత్తున నిరసనలు జరిగాయి. సోషల్ మీడియా వేదికగా యువత దేశవ్యాప్తంగా ప్రజలను సంఘటితం చేసింది. ఈ ఉద్యమాలు ప్రభుత్వంపై తీవ్రమైన ఒత్తిడి తీసుకువచ్చి పాలక వ్యవస్థలో మార్పుల చర్చకు దారితీశాయి. ప్రజలు స్వేచ్ఛాయుత ఎన్నికలు, ప్రజాస్వామ్య హక్కుల రక్షణ, ఉద్యోగావకాశాలు, అవినీతి నిర్మూలన వంటి మార్పులను కోరుకున్నారు. ఈ నిరసనల ప్రభావంతో బంగ్లాదేశ్ రాజకీయాల్లో యువత శక్తి మరింత స్పష్టమై, ప్రజల గొంతుకను ప్రపంచం గమనించే పరిస్థితి ఏర్పడింది.


శ్రీలంకలో ఆర్థిక సంక్షోభం తీవ్రరూపం దాల్చిన సమయంలో యువత, విద్యార్థులు, సామాన్య ప్రజలు కలిసి భారీ ప్రజా ఉద్యమాలను చేపట్టారు. ఇంధనం, ఆహారం, విద్యుత్ కొరతలతో విసిగిపోయిన ప్రజలు అవినీతి పాలనకు వ్యతిరేకంగా వీధుల్లోకి వచ్చారు. సోషల్ మీడియా ద్వారా సంఘటితమైన యువత "గోటా గో హోమ్" ఉద్యమాన్ని బలంగా ముందుకు నడిపింది. ఈ నిరసనల ఫలితంగా అధ్యక్షుడు గోటబయ రాజపక్సే దేశం విడిచి వెళ్లి రాజీనామా చేయాల్సి వచ్చింది. ప్రజలు పారదర్శక పాలన, ఆర్థిక స్థిరత్వం, అవినీతి నిర్మూలన, ప్రజాస్వామ్య బాధ్యత కోరుకున్నారు. ఈ ఉద్యమం శ్రీలంక రాజకీయాల్లో ప్రజాశక్తి ఎంత ప్రభావవంతమో ప్రపంచానికి చూపించింది.

నాణెకి మరో వైపు అన్నట్లు, మన దేశంలో కాక్‌రోచ్ జనతా పార్టీ విరాజయం కాదు అని అనడానికి కూడా చాలా కారణాలు ఉన్నాయి. వాటిని ఒకసారి పరిశీలిద్దాం. నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక వంటి దేశాల్లో ప్రజా ఉద్యమాలు తీవ్ర స్థాయికి చేరడానికి ప్రధాన కారణం అక్కడి ఆర్థిక, రాజకీయ సంక్షోభాలే. రోజు రోజుకూ క్షీణిస్తున్న ఆర్థిక పరిస్థితులు, పెరుగుతున్న నిరుద్యోగం, ప్రభుత్వాల వైఫల్యాలు, అవినీతి, బంధుప్రీతత్వం, ప్రజల సమస్యల పట్ల పాలకుల నిర్లక్ష్యం ప్రజల్లో తీవ్ర అసంతృప్తిని పెంచాయి. ముఖ్యంగా ఆ దేశాల్లో ప్రజలకు భవిష్యత్తుపై నమ్మకం తగ్గిపోవడం, పరిస్థితులు మెరుగుపడతాయనే ఆశలు దాదాపు లేకపోవడం ఉద్యమాలకు బలమైన పునాది అయ్యాయి. ఈ కారణాల వల్ల అక్కడ ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమాలు వేగంగా ప్రజాదరణ పొందాయి మరియు రాజకీయ మార్పులకు దారితీశాయి.

అయితే మన దేశంలో ప్రస్తుతం పరిస్థితులు ఆ స్థాయిలో లేవు. దేశంలో సమస్యలు ఉన్నప్పటికీ, ప్రజల్లో పూర్తిస్థాయి ప్రభుత్వ వ్యతిరేక భావన లేదా వ్యవస్థ కూలిపోతుందనే భయం విస్తృతంగా కనిపించడం లేదు. అందువల్ల "కాక్‌రోచ్ జనతా పార్టీ" వంటి వ్యంగ్య ఉద్యమాలు సోషల్ మీడియాలో చర్చకు వస్తున్నా, అవి పెద్ద రాజకీయ శక్తిగా మారే అవకాశాలు పరిమితంగానే కనిపిస్తున్నాయి. అంతేకాకుండా ఈ ఉద్యమానికి స్పష్టమైన సిద్ధాంతం, స్థిరమైన నాయకత్వం, ప్రజలను దీర్ఘకాలంగా నడిపించే సామర్థ్యం వంటి అంశాలు ఇంకా బలపడలేదు. ఏ ఉద్యమమైనా నిలదొక్కుకోవాలంటే భావోద్వేగం మాత్రమే కాకుండా క్రమబద్ధమైన నాయకత్వం, వ్యూహం, ప్రజల్లో విశ్వాసం కూడా అవసరం.



ప్రొఫెసర్. విశ్వేశ్వర రావు చెనమల్లు



## నేడు రాష్ట్రంలో తీవ్ర వడగాల్పుల హెచ్చరిక

**విశాఖపట్నం, మే 27, జయ జయహే :**

రాష్ట్రవ్యాప్తంగా గురువారం ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. రాష్ట్రంలోని దాదాపు 119 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 155 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని పేర్కొన్నారు. వడగాల్పుల మండలాల పూర్తి వివరాల కోసం తమ వెబ్‌సైట్ చూడొచ్చన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, పోలవరం, కాకినాడ, కోనసీమ, ఉమ్మడి గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో 45 నుంచి 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు, అల్లూరి, విశాఖ, అనకాపల్లి, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో 42 నుంచి 43 డిగ్రీలు, రాయలసీమ జిల్లాల్లో 42 నుంచి 41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే ఛాన్సలున్నాయని అంచనా వేస్తున్నట్టు వెల్లడించారుఎ. బుధవారం గరిష్ఠ ఉష్ణోగ్రతలు: పార్వతీపురంమన్యం(జి) సాలూరులో 41.8 డిగ్రీలు, ఏలూరు(జి)కుక్కునూరు, పోలవరం(జి) కూనవరంలో 41.6 డిగ్రీలు నమోదయ్యాయని వెల్లడించారు.



## బీజేపీలో చేరికలు

### కండువా వేసి ఆహ్వానించిన ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

**విశాఖపట్నం, మే 27, జయ జయహే :**

శ్రీ నిధి అసోసియేట్స్ ఎండీ సిరికి సంతోష్ కుమార్ బీజేపీ తీర్ధం పుచ్చుకున్నారు. బుధవారం బీజేపీ ఉత్తర నియోజకవర్గం పార్టీ ఆఫీసులో ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు, బిజెపి విశాఖ జిల్లా అధ్యక్షులు పరుశు రామరాజు, విశాఖ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు పొట్నూరు వెంకట కృష్ణ రావు, జిల్లా ఉపాధ్యక్షులు సురేష్ బాబు, హిందూ హైందవ ధార్మిక చైర్మన్ బుద్ధా శివాజీ తదితరుల సమక్షంలో పార్టీలో చేరారు. శ్రీనిధి అసోసియేట్స్ మేనేజింగ్ డైరెక్టర్ సిరికి సంతోష్ కుమార్, సిరికి రవిరాజ్‌లకు భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలు, పార్టీ విధి విధానాలకు ఆకర్షితులయ్యారు. దీంతో బిజెపి పార్టీ పట్ల గౌరవం పెంచుకుని ఆ పార్టీ విధి విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నారు. వీరి ఆసక్తిని గ్రహించిన నార్త్ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు పార్టీ కండువా వేసి పార్టీలో వీరితోపాటు రాజన్న ప్రవీణ్ కుమార్, ఐతం మధు కుమార్, పొట్నూరు సుమంత్ తదితర 60 మంది కొత్త సభ్యులను పార్టీలో చేర్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భారతీయ జనతా పార్టీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, నచ్చి పార్టీలో సభ్యత్వాలు తీసుకున్నామని, దేశం కోసం ధర్మం కోసం, తామంతా పనిచేయడం కోసం సిద్ధంగా ఉన్నామన్నారు.




## విద్యుత్ అంతరాయాలకు కంట్రోల్ రూమ్

**విశాఖపట్టణం, మే 27, జయ జయహే**


గత కొద్ది రోజులుగా ఎల్‌నినో ప్రభావంతో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరిగినట్లు తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ విశాఖ పర్యవేక్షక ఇంజనీర్ జి. శ్యాంబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వినియోగదారులకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రత్యేకంగా విశాఖపట్నం సర్కిల్ కార్యాలయంలో జూనియర్ ఇంజనీర్ ఆధ్వర్యంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం ఏర్పడిన వెంటనే వినియోగదారులు టోల్ ఫ్రీ నంబర్ 1912 కు లేదా విశాఖపట్నం కంట్రోల్ రూమ్ నంబర్ 0891-2718091 కు సమాచారం అందించవలసిందిగా విశాఖపట్నం ఆపరేషన్ సర్కిల్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు విజ్ఞప్తి చేసారు.

# మధురవాడలో 3.5 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా

**- నలుగురు రెవెన్యూ అధికారుల మెడకు బిగుస్తున్న ఉచ్చు**

**- ఆ వ్యవహారంపై విచారణకు 'ప్రెజెంటింగ్ ఆఫీసర' నియామకం**

**విశాఖపట్నం, మే 27, జయ జయహే :**



మధురవాడ పరిధిలోని కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమి వ్యవహారంలో అవినీతి, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న నలుగురు రెవెన్యూ అధికారులపై క్రమశిక్షణా చర్యలను ప్రభుత్వం మరింత వేగవంతం చేసింది. ఈ కేసులో విచారణాధికారి (ఎంక్వైరీ అథారిటీ) ముందు ప్రభుత్వ పక్షాన వాదనలు బలంగా వినిపించేందుకు వీలుగా విశాఖపట్నం జిల్లా రెవెన్యూ అధికారిని 'ప్రెజెంటింగ్ ఆఫీసర'గా నియమిస్తూ రెవెన్యూ (విజిలెన్స్.1) శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ జీవో ఆర్టీ నెంబర్ 848 ద్వారా ఉత్తర్వులు జారీ చేశారు. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. విశాఖపట్నం రూరల్ పరిధిలోని మధురవాడ గ్రామంలో గల సర్వే నెంబర్ 133-పి లో 3.47 ఎకరాల విస్తీర్ణం కలిగిన ప్రభుత్వ 'రాస్తా పొరంబోకు' (రహదారి) భూమి ఉంది. అయితే, ఇది ప్రభుత్వ భూమి అని స్పష్టంగా తెలిసినప్పటికీ... కొందరు ప్రైవేటు వ్యక్తుల క్లెయిమ్‌ను తిరస్కరించకుండా, సదరు అధికారులందరూ మౌనం వహించడమే కాకుండా, విశాఖ జిల్లా కలెక్టర్‌కు తప్పుడు (ఫోర్జరీ/ఫ్యాబ్రికేటెడ్) నివేదికను సమర్పించారనే తీవ్రమైన ఆరోపణలు వచ్చాయి. దీనిపై సమగ్ర విచారణ అనంతరం 1991 ఏపీ సివిల్ సర్వీసెస్ (సీసీఏ) నిబంధనల ప్రకారం ప్రభుత్వం చార్జ్ మెమోలు జారీ చేసింది. అప్పటి విశాఖ ఆర్డీవో ఎస్. భాస్కరరెడ్డి, అప్పటి ల్యాండ్ ప్రొటెక్షన్ స్పెషల్ ఆరఐ (ప్రస్తుతం భీమునిపట్నం తహశీల్దార్ కార్యాలయంలో ఎంఆరఐగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న టి. మల్లేశ్వరరావు, మధురవాడ గ్రేడ్ 1 వీఆర్వో వి. సూరిబాబు, గ్రేడ్ 2 వీఆర్వో కె. దుర్గా ప్రసాద్‌లు విచారణ ఎదుర్కొంటున్నారు. ఈ నలుగురు నిందితులు ఇప్పటికే తమపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి ప్రభుత్వానికి లిఖితపూర్వక సంజాయిషీ (డిఫెన్స్ స్టేట్‌మెంట్) సమర్పించారు. అయితే, వీరి వివరణ సంతృప్తికరంగా లేకపోవడంతో పూర్తిస్థాయి విచారణ కోసం విశాఖపట్నం జిల్లా జాయింట్ కలెక్టర్ అండ్ అడిషనల్ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ ఎం.ఎస్. గొబ్బిళ్ల విద్యాధరిని 'ఎంక్వైరీ అథారిటీ'గా ప్రభుత్వం ఇప్పటికే (జీవో ఆర్టీ 847 ద్వారా) నియమించింది.జాయింట్ కలెక్టర్ నేతృత్వంలో జరిగే ఈ విచారణలో, నిందితులపై ఉన్న చార్జ్ షీట్లను, సాక్ష్యాలను క్రమశిక్షణా అధికారి తరపున సమర్థవంతంగా ప్రవేశపెట్టేందుకు ఏపీ సివిల్ సర్వీసెస్ రూల్ 20 లోని సబ్-రూల్ (5)(ఏ) ప్రకారం విశాఖపట్నం జిల్లా రెవెన్యూ అధికారి కి బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం తాజా ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు తదుపరి చర్యల కోసం ఉత్తర్వుల ప్రతులను సీసీఎలఏ, విశాఖ కలెక్టర్, సదరు అధికారులకు పంపారు. దీంతో అవినీతి రెవెన్యూ వర్గాల్లో అలజడి రేగింది.


## మే 30లోగా జీవీఎంసీ పరిధిలో

# ఇండ్ల గణన పూర్తి

**వచ్చే ఫిబ్రవరిలో జనాభా సేకరణ**

**సిటీ సెన్సస్ అధికారి రమణమూర్తి.**

**విశాఖపట్నం, మే 27, జయ జయహే**



జీవీఎంసీ కమిషనర్, ప్రిన్సిపల్ సెన్సెస్ ఆఫీసర్ కేతన్ గార్గ్ ఆదేశాల మేరకు నగరంలో సెన్సెస్ 2027 కు సంబంధించి ముందస్తు ప్రక్రియలో భాగంగా చేపట్టిన తొలి విడత "ఇండ్ల గణన" (హౌస్ లిస్టింగ్) ముగింపు దశకు చేరుకుందని , మే 1న ప్రారంభమైన ఈ ప్రక్రియ మే 30 తో ముగియనున్నట్లు జీవీఎంసీ అదనపు కమిషనర్ (రెవెన్యూ) మరియు సిటీ సెన్సెస్ అధికారి డి.వి. రమణమూర్తి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగర పరిధిలో 97 శాతం ఇండ్ల గణన పూర్తి అయ్యి మొత్తం 9,13,650 ఇండ్లను నమోదు చేసినట్లు వెల్లడించారు. అలాగే నిర్మాణం పూర్తై ఎవరూ నివసించని 1,47,000 ఖాళీ ఇండ్లు, తాళాలు వేసి ఉన్న 37,358 ఇండ్లను అధికారులు గుర్తించినట్లు తెలిపారు. వేసవి సెలవుల కారణంగా చాలామంది ఊర్లకు వెళ్లడం వల్ల ఇండ్లు లాక్ చేసి ఉండవచ్చన్నారు.ఈ తొలి విడతలో కేవలం ఇండ్ల గుర్తింపు మాత్రమే జరుగుతుందని, అసలైన జనాభా లెక్కల సేకరణ రెండో విడతలో 2027 ఫిబ్రవరి నెలలో నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. ఇప్పటివరకు తమ ఇంటి వివరాలు నమోదు కాలేదని భావించే వారు, ఖాళీ ఇండ్ల యజమానులు, తాళాలు వేసి ఉన్న ఇండ్ల వారు వెంటనే సమీప వార్డు సచివాలయం లేదా జీవీఎంసీ ప్రధాన కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. 9014218870 హెల్ప్ లైన్ నంబర్‌కు ఫోన్ చేసి తమ ప్రాంత వివరాలు తెలియజేస్తే, సెన్సెస్ సిబ్బంది నేరుగా ఇంటికి వచ్చి వివరాలు నమోదు చేస్తారని తెలిపారు.నగర ప్రజలందరూ ఇండ్ల గణన ప్రక్రియకు పూర్తి స్థాయిలో సహకరించాలని అదనపు కమిషనర్ డి.వి. రమణమూర్తి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.




## కూటమి విచ్ఛిన్నకారులను వదిలేది లేదు..!

**- త్వరలో అరెస్టులు కూడా ఉంటాయి**

**- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్**

**విశాఖపట్నం, మే 27, జయ జయహే :**

ముసుగు వీరులను ఎవరిని విడిచిపెట్టబోమని...జగన్మోహన్ రెడ్డితో సహా.. ఎవరు చేసిన పాపాలకు వారు పరిహారం చెల్లించుకోక తప్పదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. అవసరమైతే అరెస్టులు కూడా ఉంటాయని హెచ్చరించారు. బుధవారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమిని విచ్ఛిన్నం చేయాలనుకునే శక్తులన్నిటికీ హెచ్చరికలు చేస్తున్నామని... మీరు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలించవన్నారు. ఇటీవల కాలంలో జనసేన బిజెపి విషయంలో ఒక ఎనలిస్ట్ తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకున్నారని గుర్తు చేశారు. కొంతమంది కావాలని, చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని, అలా చిచ్చు పెట్టేందుకు మైండ్ గేమ్‌తో ముందుకు వస్తున్నారన్నారు. మొన్న ఎన్నికల్లో వలసదారులు, లేక పోవటం వలన ఎన్నికలు సజావుగా సాగాయని, కాక్రోచ్ పార్టీ, వెనకాల ఎవరెవరున్నారో ఎలాంటి దేశ వ్యతిరేక శక్తులు ఉన్నాయో గుర్తించామన్నారు. సర్‌లో అందరూ భాగస్వామ్యులు కావాలని, 20 సంవత్సరాలు ఓటు హక్కులో మార్పు తీసుకు రావాలని, ప్రధాని మోడీ 12 ఏళ్ల పాలనను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. జూన్ 1 నుండి 30 వరకు కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని, ఎన్విరాన్మెంట్ డే సెలబ్రేట్ చేస్తాం..ప్రకృతి వ్యవసాయం.. ప్రమోట్ చేస్తాం...యోగా ట్రైనింగ్ కార్యక్రమం లు నిర్వహిస్తున్నాం...ప్రజల్లోకి కూటమి విజయాలు తీసుకు వెళ్తాం..కూటమి 2 వసంతాలు పూర్తి పై కార్యక్రమాలు చేపడతాం...పోలవరం త్వరిత గతిన ముందుకు తీసుకు వెళ్తున్నాం...15 లక్షల పెట్టుబడులు ఏపీ కి తీసుకొచ్చామని వివరించారు. అనంతరం విశాఖ బిజెపి పార్టీ కార్యాలయంలో, రేపటినుండి నాలుగు రోజులు జరిగే మ్యాంగో మేళా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కే సురేంద్రమోహన్, బీజేపీ జిల్లా అధ్యక్షులు పరశురామ రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ దానిష్ తదితరులు పాల్గొన్నారు.

# చోడవరంలో ఘనంగా మహానాడు వేడుకలు

**నియోజకవర్గంలోని 9 క్లస్టర్ల పరిధిలో వర్చువల్ మహానాడు ప్రారంభం..**

**ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించి, పార్టీ జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్యే కె రాజు**

**చోడవరం : మే 27, జయ జయహే**



చోడవరంలో డిజిటల్. మహానాడు వేడుకలు బుధవారం పండుగ వాతావరణంలో ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్. రాజు ప్రారంభించారు. తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకలలో తెలుగుజాతి ఆత్మగౌరవ ప్రతీక, టీడీపీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కార్యాలయ ప్రాంగణంలో పార్టీ జెండాను ఆవిష్కరించి, కేడర్‌లో సరికొత్త ఉత్సాహాన్ని నింపారు. మొత్తం 9 క్లస్టర్లలో 'వర్చువల్ మహానాడు' ప్రత్యక్ష ప్రసారంను నియోజకవర్గ చరిత్రలోనే సరికొత్తగా, సాంకేతికతను జోడించి ఈ సారి మహానాడును ప్రతి కార్యకర్తకూ డిజిటల్ పద్ధతిలో చేరువ చేశారు. ప్రధాన కార్యాలయంతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా వర్చువల్ మహానాడు వేడుకలు ఏకకాలంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. మంగళగిరి కేంద్ర పార్టీ కార్యాలయం నుండి జరుగుతున్న ఈ ప్రతిష్టాత్మక మహానాడు కార్యక్రమాన్ని, ఆయా క్లస్టర్ వేదికలలో ఏర్పాటు చేసిన భారీ స్క్రీన్ల ద్వారా స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. ఎమ్మెల్యే రాజు క్లస్టర్ల వేదికల వద్దకు వెళ్ళి అక్కడ కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆలోచనలకు అనుగుణంగా ఇంధన పొదుపులో భాగంగా, కార్యకర్తలు ఎక్కడికక్కడ క్లస్టర్ల పరిధిలోనే డిజిటల్ వేదికల ద్వారా మహానాడులో భాగస్వాములు కావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమాల్లో నియోజకవర్గ పరిధిలోని టిడీపీ నాయకులు, మహిళా ప్రతినిధులు, తెలుగు యువత, 9 క్లస్టర్ల పరిధిలోని వేలాది మంది పార్టీ శ్రేణులు, అభిమానులు అత్యంత ఉత్సాహంగా పాల్గొన్నారు.



## హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి జిల్లా మహిళా అధ్యక్షురాలుగా సుబ్బలక్ష్మి

**మాడుగుల మే 27 జయ జయహే**

అనకాపల్లి జిల్లా హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి మహిళా అధ్యక్షురాలుగా చెందిన మండల సంతోషి సుబ్బలక్ష్మి ను నిర్మించారు. అలాగే జిల్లా గౌరవ అధ్యక్షులుగా కొణతాల రాజాబాబు నీ నియమించారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షులు బసవరాజు ఆదేశాలు జారీ చేసినట్టు బుధవారం ఇక్కడ తెలిపారు. బుధవారం అనకాపల్లిలో జరిగిన కార్యక్రమంలో నియామక పత్రం అందజేసినట్టు సుబ్బలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా అనకాపల్లి మండలం కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనకాపల్లి జిల్లాలో మిగిలిన అన్ని మండలాల్లో కూడా కమిటీలు నియామకం జరపాలని రాష్ట్ర అధ్యక్షులు ఆదేశించారన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు బసవరాజు ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుద్రయ్య , రాష్ట్ర ఉపాధ్యక్షులు రామరాజు , రాష్ట్ర ఉపాధ్యక్షులు కొణతాల అప్పలరాజు లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కమిటీ జిల్లాలో గల హిందూ దేవాలయాల పరిరక్షణకు కృషి చేస్తాదని తెలిపారు.




## భోగాపురం ఎయిర్పోర్ట్ రహదారుల అనుసంధానం వేగవంతం కావాలి

**సమీక్షలో కలెక్టర్ అభిషిక్త్ కిషోర్**

**విశాఖపట్నం, మే 27, జయ జయహే :**

భోగాపురం ఎయిర్పోర్ట్ జూలై మొదటి వారంలో ప్రారంభం జరగనున్నందున సంబంధిత శాఖల అధికారులు వేగంగా స్పందించి జూన్ 30 నాటికి పూర్తిచేయాలని కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిషోర్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎయిర్పోర్ట్ కనెక్టివిటీ రోడ్లు, వి. ఎం. ఆర్. డి. ఏ. ల్యాండ్ పూలింగ్, లేఔట్స్ అంశాలపై వీఎమ్ఆర్డిఏ, జీవీఎంసీ, ఆర్ అండ్ బి, భోగాపురం ఎయిర్పోర్ట్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ భోగాపురం ఎయిర్పోర్ట్ అనుసంధానం రోడ్ల పురోగతినీ నిశితంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ నగరం నుండి భోగాపురం ఎయిర్ పోర్టుకు అనుసంధానం చేసే ఏడు రోడ్లతోపాటు ఇతర రోడ్లను కూడా అభివృద్ధి చేయాలని కలెక్టర్ కోరారు. అధికారులు సమన్వయంతో మిషన్ మోడ్ తో పనులు పూర్తి చేయాలన్నారు. రోడ్ల నిర్మాణం , సైన్ బోర్డులు ,విద్యుత్ దీపాలు, బస్సు టెర్మినల్, చార్జింగ్ పాయింట్లు యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. రాపిడో, ఊబర్, ఓలా సర్వీసుల ఏర్పాటుకు ఆ ప్రతినిధులతో సమావేశం నిర్వహించాలన్నారు. ఇకపై ప్రతివారం సమీక్ష చేస్తామని, ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని లేదా ఉన్నతాధికారులతో చర్చించి పరిష్కరించుకోవాలని కోరారు. వి ఎం ఆర్ డి ఏ ద్వారా చేపడుతున్న ల్యాండ్ పూలింగ్ సమగ్రంగా చేపట్టాలని, లేఅవుట్ల అభివృద్ధి వేగవంతం చేయాలని, ఆర్డీవో భూమి అప్పగించాలని, వి ఎమ్ఆర్డిఏ అధికారులు లేఔట్లకు నంబర్లు ఇచ్చి మౌలిక సదుపాయాలు కల్పించడానికి కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో వీఎమ్ఆర్డిఏ కమిషనర్ తేజ్ భరత్. జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ వర్చువల్ గా,భీమిలి ఆర్డిఓ సంగీత్ మాథుర్, విఎంఆర్డిఏ ఎస్ఈ వినయ్, జీవీఎంసీ సీఈ సత్యనారాయణ రాజు, ఆర్టీసీ రీజనల్ మేనేజర్ అప్పలనాయుడు, ఈపీడీసీఎల్ ఎస్ ఈ శ్యాంబాబు, ఆర్ అండ్ బీ ఎస్ ఈ జాన్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



## కార్యకర్తే అధినేత

**కొయ్యూరులో తొలిరోజు మహానాడు సభ గ్రాండ్ సక్సెస్..**

**కొయ్యూరు : (జయ జయహే ) న్యూస్ మే 28**

కార్యకర్తే అధినేతగా మండల కేంద్రంలో బుధవారం జరిగిన తొలిరోజు మహానాడు సభ విజయవంతమైంది. తొలుత నేతలు టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షులు అన్న ఎన్టీఆర్ ఫోటోకి పూలమాలవేసి నివాళులు అర్పించారు.: యువగళంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంటుందని నేతలు హర్షం వ్యక్తం చేశారు. వైసీపీ అసత్య ప్రచారాలను తిప్పి కొట్టేందుకు ప్రతి కార్యకర్త అప్రమత్తంగా ఉండాలని తీర్మానించారు.తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, స్త్రీ శక్తి, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు తదితర పథకాలను గుర్తు చేసుకుంటూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.మండల పార్టీ ప్రధాన కార్యదర్శి తోట దొరబాబు నేతృత్వంలో జరిగిన సభలో మండల ఉపాధ్యక్షురాలు గాం రమాదేవి, క్లస్టర్ ఇన్చార్జీలు బోనంగి సత్యవతి, స్.మీనా, కోఆపరేటివ్ చైర్మన్ సుమర్ల సాంబశివ, మాజీ ఫీుజ శివరామరాజులి, సర్పంచ్ పిటా సింహాచలం, బంటు లక్ష్మణ్, మాజీ సర్పంచ్ శంకర్రావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తోకల దేవి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు. పెద్ద ఎత్తున కార్యకర్తలు, మహిళలు హాజరయ్యారు.రెండో రోజైన గురువారం జరిగే మహానాడు సభను మరింత విజయవంతం చేయాలని నేతలు కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

# టీడీపీలో కార్యకర్తలే రథ సారథులు





### మహానాడులో మంత్రి సవిత
### మంత్రి సవిత ప్రసంగంపై సీఎం అభినందనలు
### పార్టీకి మంత్రి సవిత రూ.50 లక్షల విరాళం

**మంగళగిరి/అమరావతి :(జయ జయహే)**

టీడీపీలో కార్యకర్తలే రథ సారథులని, వారి అభీష్టం మేరకే ఎంపీ, ఎమ్మెల్యేల అభ్యర్థులను ఖరారు చేస్తారని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖామాత్యులు ఎస్.సవిత తెలిపారు. కార్యకర్తను బాధ్యతాయుతమైన పౌరుడిగా, ప్రజా సమస్యల పరిష్కారంలో సుశిక్షితుడైన, క్రమశిక్షణ కలిగిన సైనికుడిగా టీడీపీ అధిష్టానం తీర్చిదిద్దితే... గొడ్డలి పార్టీ తమ పార్టీ కార్యకర్తలను సంఘ విద్రోహశక్తులుగా తయారు చేస్తోందంటూ వైసీపీపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ హైబ్రిడ్ మహానాడు సందర్భంగా కార్యకర్తే అధినేత అంశంపై తీర్మానం సందర్భంగా ఆమె మాట్లాడారు. తెలుగుజాతి అభ్యున్నతికి, యువత, కార్మిక, కర్షకుల కోసం అన్న ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారన్నారు. పార్టీని నెలకొల్పిన తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి తీసుకొచ్చారన్నారు. ఆనాటి అగ్రవర్ణాల దురహంకారాన్ని నిలదీస్తూ, అణగారిన వర్గాలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించారన్నారు. ఎన్.టి.ఆర్. అంటే మూడు అక్షరాలు మాత్రమే కాదని, బడుగు, బలహీన వర్గాలకు ఆత్మగౌరవాన్ని ఇచ్చిన మంత్రాక్షరాలని కొనియాడారు. దేశానికి స్వాతంత్ర్యం 1947లో వస్తే, రెండు తెలుగు రాష్ట్రాలకు అన్న ఎన్టీఆర్ రాకతో సంపూర్ణ స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. ఎన్టీఆర్ సీఎం చంద్రబాబునాయుడు, పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ భుజానకెత్తుకుని పార్టీని మరింత బలంగా ముందుకు తీసుకెళుతున్నారన్నారు.

**మంత్రి సవితకు చంద్రబాబు అభినందనలు**

కార్యకర్తే అధినేత తీర్మానం సందర్భంగా మంత్రి సవిత ప్రసంగం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరుగుతున్న హైబ్రిడ్ మహానాడు కార్యక్రమానికి హాజరైన కార్యకర్తల్లో జోష్ నింపింది. టీడీపీలో కార్యకర్తల అభ్యున్నతి, వారికిచ్చే ప్రాధాన్యంతో పాటు వైసీపీలో కార్యకర్తలను ఎలా వాడుకుంటున్నది మంత్రి సవిత వివరించిన తీరుపై సభలో హర్షధ్వానాలు వ్యక్తమయ్యాయి. ప్రసంగం పూర్తికాగానే మంత్రి సవితను పిల్చి సీఎం చంద్రబాబునాయుడు తన పక్కనే కూర్చొండబెట్టుకుని అభినందించారు.

**పార్టీకి మంత్రి సవిత రూ.50 లక్షల విరాళం**

పార్టీ అభివృద్ధికి మహానాడు వేదికగా పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు విరాళాలు ప్రకటించారు. మంత్రి సవిత రూ.50 లక్షల విరాళం అందజేసినట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు.

# రాజమండ్రి ఆంధ్రా పేపర్ మిల్లు తీరుపై మంత్రి కందుల ఫైర్

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**



గోదావరి నది కాలుష్యానికి కారణమవుతున్న పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ హెచ్చరించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాజమహేంద్రవరం పర్యటన విజయవంతంగా ముగిసిందని పేర్కొన్న మంత్రి, 2027 గోదావరి పుష్కరాలను కాలుష్యరహితంగా నిర్వహించాలన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. పవన్ కళ్యాణ్ పర్యటన సందర్భంగా గోదావరి కాలుష్య సమస్యలపై సమగ్ర సమీక్ష నిర్వహించారని తెలిపారు. ముఖ్యంగా రాజమండ్రి ఆంధ్రా పేపర్ మిల్లు వల్ల పెరుగుతున్న కాలుష్యంపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "స్థానిక వనరులతో కోట్ల రూపాయల లాభాలు పొందుతూ ప్రజల ప్రాణాలను ప్రమాదంలో పడేయడం సహించం. పరిశ్రమలు బాధ్యతగా వ్యవహరించాలి. కార్మికులు, ప్రజల ఆరోగ్యం కంటే లాభాలకే ప్రాధాన్యం ఇవ్వడం సరికాదు" అని హెచ్చరించారు. కాలుష్య నియంత్రణలో నిర్లక్ష్యం వహించే పరిశ్రమలపై చట్టపరమైన చర్యలు తప్పవని మంత్రి స్పష్టం చేశారు. గోదావరిలో కలిసే మురుగు జలాలు, ప్లాస్టిక్ వ్యర్థాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నామని చెప్పారు. నల్లా ఛానల్ ప్రక్షాళన పనులు వేగవంతం చేస్తున్నామని, పంచాయతీరాజ్ శాఖకు రూ.100 కోట్లు మంజూరు చేసి కాలుష్య నివారణ చర్యలను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. అలాగే పుష్కరాల నాటికి రాజమహేంద్రవరం సిటీతో పాటు రూరల్ ప్రాంతాల్లోని స్నాన ఘాట్ల ఆధునీకరణ పనులను వేగంగా పూర్తి చేస్తామని చెప్పారు. విజ్జేశ్వరం--సిద్ధాంతం ఏటిగట్టు రహదారి అభివృద్ధికి 33 కిలోమీటర్ల మేర ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. కూటమి ధర్మాన్ని పాటిస్తూ అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ రెండింటికీ సమాన ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.



## మంచినీటి సమస్యను తీరుస్తున్న మాజీ ఎంపీటీసీ

**నక్కపల్లి జయ జయహే**

నక్కపల్లి మండలం డియర్ పురం గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్ర మంచినీటి సమస్యను తాత్కాలికంగా ఉపశమనం కలిగించేందుకు ట్రాక్టర్ ద్వారా వాటర్ ట్యాంక్ ద్వారా ప్రజలకు మాజీ ఎంపీటీసీ గింజల వెంకటరమణ ఆధ్వర్యంలో డిఎల్ పురం లో జగనన్న కాలనీకి కొంతమంది దాతల సహకారంతో మంచినీటి సరఫరా నిర్విరామంగా అందిస్తున్నారు, జగనన్న కాలనీ మంచినీటి సమస్యను తీర్చుటకు శాశ్వతంగా జిల్లా కలెక్టర్ మరియు హోమ్ మినిస్టర్ వంగలపూడి అనిత సహకారంతో పైప్ లైన్ ఏర్పాటు జరుగుచున్నది. ప్రజలందరూ ప్రత్యేక ధన్యవాదములు తెలుపుతూ డిఎల్ పురం గ్రామంలో ఇప్పుడు తీవ్రంగా ఉన్న మంచినీటి ఇబ్బందులను పూర్తిస్థాయిలో పరిష్కరించుటకు కూడా సహకరించాలని మాజీ ఎంపీటీసీ సభ్యులు గింజల వెంకటరమణ కోరారు



## ఎన్టీఆర్ హాస్పిటల్‌ను ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ

**అనకాపల్లి మే 27. జయ జయహే.**

స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ బుధవారం స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయం ను ఆకస్మికంగా సందర్శించడం జరిగింది గర్భిణీ వార్డు సందర్శించి అక్కడ పేషెంట్లతో ఆయన మాట్లాడడం జరిగింది చంటి పిల్లలకు అలాగే బాలింతలకు అందుతున్న సౌకర్యాలు గురించి అడిగి తెలుసుకోవడం జరిగింది ఎండ వేడి చాలా ఇబ్బందిగా ఉందని రాత్రులు కరెంటు పోతే చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మంగళవారం వచ్చిన గాలి వర్షానికి రాత్రి కరెంటు పోయి చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నామని ఆయనకు తెలియజేయడం జరిగింది పేషెంట్ లు చెప్పిన మాటలు విన్న ఎమ్మెల్యే రామకృష్ణ ప్రస్తుతం ఉన్న మూడో ఫ్లోర్ నుంచి రెండో ఫ్లోర్ కి మార్చాలని ఎస్ ఎన్ సి యు చిన్న పిల్లల వాటికి నూతన ఎయిర్ కండిషన్ వినియోగం లోకి తీసుకురావాలని ఆస్పటల్ సూపర్డెంట్ కి ఆదేశాలు ఇవ్వడం జరిగింది పేషెంట్స్ తో ట్రీట్మెంట్ కొరకు వచ్చే వారి వివరాలు సమస్యలు అడిగి తెలుసుకున్నారు హాస్పటల్ మెయింటెనెన్స్, ఆపరేషన్ థియేటర్లో నిర్వహిస్తున్న పరిశుభ్రతను ఆయన పరిశీలించి అక్కడ వారిని వివరాలు అడిగి తెలుసుకోవడం జరిగింది హాస్పిటల్ కి వచ్చే పేషెంట్స్ కి మెరుగైన వైద్యం అందించాలని మందులు కొరత ఉండరాదని ముఖ్యంగా పరిసరాలు హాస్పటల్ లోపల పరిశుభ్రత పాటించాలని అలాంటి విషయాల్లో ఉపెక్షించేది లేదని ఆయన డాక్టర్లకు, క్లీనింగ్ కాంట్రాక్టర్లకు తెలియజేయడం జరిగింది అనకాపల్లి వైద్య సిబ్బంది కూటమి నాయకులు స్థానికులు పాల్గొనడం జరిగింది

# కోట సత్తెమ్మ ఆలయంలో శక్తి అవేర్నెస్ కార్యక్రమం.

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి:**




తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు, కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ ఆధ్వర్యంలో, నిడదవోలు సీఐ తిలక్ పర్యవేక్షణలో కొవ్వూరు జోన్ నిడదవోలు సర్కిల్ శక్తి టీమ్ ఆధ్వర్యంలో తిమ్మారాజుపాలెం శ్రీ కోట సత్తెమ్మ తల్లి అమ్మవారి ఆలయం వద్ద భక్తులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శక్తి టీమ్ ఏఎస్ఐ గంగాధరరావు, మహిళా పోలీస్ కానిస్టేబుల్ శాంతి పాల్గొని సుమారు 40 మంది భక్తులకు మహిళల భద్రత, చిన్నారుల రక్షణ, సైబర్ నేరాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ముఖ్యంగా మహిళలు ఒంటరిగా ప్రయాణించే సమయంలో "శక్తి యాప్" ఎంతగానో ఉపయోగపడుతుందని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీసులకు సమాచారం చేరవేయడానికి ఈ యాప్ ఉపయోగకరమని వివరించారు. అలాగే ప్రస్తుతం పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటీపీ , ఆధార్ వివరాలు, అనుమానాస్పద ఏపీకె లింకులు, ఫోటో మార్ఫింగ్, ఆన్‌లైన్ లోన్ మోసాలు వంటి వాటిపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. అపరిచిత వ్యక్తులకు వ్యక్తిగత సమాచారం ఇవ్వకూడదని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ గంగాధరరావు మాట్లాడుతూ మహిళలు, చిన్నారుల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. చిన్న పిల్లలను ఒంటరిగా వదలకూడదని, రద్దీ ప్రదేశాల్లో పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అలాగే విలువైన ఆభరణాలు, నగదు బ్యాగ్‌లలో పెట్టుకొని ప్రయాణించడం సురక్షితం కాదని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇక గ్రామాల్లో నాటు సారా, గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయాలు లేదా అక్రమ కార్యకలాపాలు కనిపిస్తే భయపడకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజల సహకారంతోనే సమాజంలో శాంతి భద్రతలు మరింత బలోపేతం అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అడిషనల్ కమిషనర్ హరి సూర్యనారాయణ, సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, దేవస్థానం సిబ్బంది నారాయణ తదితరులు పాల్గొన్నారు..



## మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను కలిసిన పేరాడ తిలక్

### టెక్కలి నియోజకవర్గం సంస్థాగత కమిటీలపై మాటామంతి

**టెక్కలి మే 27 జయ జయహే**

వైయస్సార్సీపి జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి కి తాడేపల్లిగూడెం క్యాంపు కార్యాలయంలో టెక్కలి వైఎస్ఆర్సిపి సమన్వయకర్త పేరాడ తిలక్ మర్యాదపూర్వకంగా కలిశారు, ఈ కలయికలో నియోజకవర్గ పరిధిలోని వైయస్సార్సీపి సంస్థాగత కమిటీల నిర్మాణం క్షేత్రస్థాయిలో నీ పలు అంశాలను జగన్ దృష్టికి తిలక్ తీసుకువెళ్లారు. టెక్కలి నియోజకవర్గం పరిధిలో పలువురు వైయస్సార్సీపి కార్యకర్తలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చం నాయుడు అక్రమ కేసులు బనాయిస్తున్నట్లు జగన్ దృష్టికి తీసుకు వెళ్లినట్లు వైఎస్ఆర్సిపి పార్టీ వర్గాలు ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలో గ్రామ, పంచాయతీల్లో సమగ్రమైన కమిటీల ఏర్పాటు పై తిలక్ ను జగన్మోహన్ రెడ్డి అభినందించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.



## కార్యకర్తలతో కలిసి మహానాడు వీక్షణ

### క్లస్టర్లలో ఏర్పాట్లు పరిశీలించిన గంటా

**భీమిలి, మే 27 (జయ జయహే)**

నియోజకవర్గంలో వివిధ క్లస్టర్లలో బుధవారం జరిగిన మహానాడు కార్యక్రమాలను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సందర్శించారు. భీమిలి సహా తగరపువలస, జీవీఎంసీ 6 వ వార్డు తదితర ప్రాంతాల్లో పాల్గొన్నారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మై టీడీపీ యాప్ ద్వారా డిజిటల్ హాజరు వేసుకున్నారు. మహానాడులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ప్రసంగాలను కార్యకర్తలతో కలిసి వీక్షించారు. పార్టీ నిర్దేశించిన విధంగా కార్యక్రమ నిర్వహణ జరగాలని స్థానిక క్లస్టర్ బాధ్యులకు సూచించారు. మహానాడులో పాల్గొన్న వారికి ఏర్పాటు చేసిన భోజన పదార్థాలను పరిశీలించారు. రెండు రోజుల పాటు జరిగే మహానాడుకు హాజరయ్యే వారికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యకర్తలు, నాయకులు క్రమశిక్షణకు ప్రాధాన్యమివ్వాలని కోరారు. టీడీపీ నాయకులు చిక్కాల విజయ్ బాబు, గాడు వెంకటప్పడు, సరగడ అప్పారావు, గాడు చిన్ని కుమారి లక్ష్మి, గంటా నూకరాజు, గొలగాని నరేంద్ర, కనకల అప్పలనాయుడు, చురకల రమణ, పొట్నూరు రాము, మాన్యాల సోంబాబు, గరే గుర్నాథ్, పోలిశెట్టి నాగేశ్వరరావు, లొడగల జానకిరాం తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకారుల మృతిపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మంత్రి

**అమరావతి, మే 27: (జయ జయహే)**



నెల్లూరు జిల్లా తీరప్రాంతంలో జరిగిన విషాదకర పడవ ప్రమాద ఘటనపై రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులు మృతి చెందడం అత్యంత బాధాకరమని పేర్కొంటూ, మృతుల కుటుంబాలకు మంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపారు. బోగోలు మండలం, జువ్వలదిన్నె గ్రామ పరిధిలోని అలిచెర్ల బంగారుపాళెం హ్యాంలెట్‌కు చెందిన మత్స్యకారులు వేట కోసం సముద్రంలోకి వెళ్లిన సందర్భంగా ఈ విషాద ఘటన చోటుచేసుకుందని అధికారులు మంత్రికి వివరించారు. భారీ ఈదురుగాలులు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా పడవలు ప్రమాదానికి గురైనట్లు తెలిపారు. సముద్రంలోకి వెళ్లిన ఐదుగురు మత్స్యకారుల్లో ఒకరు సురక్షితంగా తిరిగి రాగా, ఇద్దరు మత్స్యకారులు మృతి చెందినట్లు అధికారులు నిర్ధారించారు. మరో ఇద్దరు మత్స్యకారులు గల్లంతయ్యారని, వారి కోసం ముమ్మర గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. గల్లంతైన మత్స్యకారులను క్షేమంగా గుర్తించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, జిల్లా అధికారులతో నిరంతరం సంప్రదింపులు కొనసాగిస్తున్నారు. బాధిత కుటుంబాలకు తక్షణ సహాయం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరఫున ఒక్కొక్కరికి రూ.10 లక్షల నష్టపరిహారం అందజేస్తామని మంత్రి ప్రకటించారు. బాధిత మత్స్యకార కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సముద్రంలో వేటకు వెళ్లే మత్స్యకారులు వాతావరణ హెచ్చరికలను తప్పనిసరిగా గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. ప్రమాదకర వాతావరణ పరిస్థితుల్లో సముద్రంలోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మరణించిన వారిలో తూపిలి బాలమురళి, కుమారి గోవిందు, కనిపించకుండా ఉన్నవారిలో తులసింగారి గణేష్, తులసింగారి రాజా ఉన్నారని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

# కాంగ్రెస్, ఆప్ ఎజెండాతో కాక్రోచ్ పార్టీ

**భారత రాజకీయాల్లో యువత ప్రవేశించాలి. నేతల అక్రమాలను ప్రశ్నించాలి. అక్రమాలను నిలదీయాలి. అక్రమార్కులను ఎండగట్టాలి. పాచి పోయిన విధానాలను తూర్పారా పట్టాలి. ఈ దేశానికి ఏది అవసరమో దానిని ఎజెండగా ముందుకు తీసుకుని రావాలి. కానీ యువత ఎందుకనో అచేతనంగా ఉంటోంది. ఓటు వేయడానికే బద్ధకిస్తోంది. జెన్ జి అంటూ వార్తలు వస్తున్నా..గట్టిగా నిలబడి రాజకీయ అవినీతిని నిలదీయడం లేదు. రాజకీయ అక్రమాలను నిలదీయడం లేదు. కానీ కాక్రోచ్ జనతా పార్టీ పేరుతో ఆన్‌లైన్ వేదికగా పుట్టుకు వచ్చిన ఓ పార్టీకి కోట్లల్లో లైకులొ కొడుతూ..వస్తున్నారు. నిజంగానే ఈ పార్టీ పెట్టిన వారు..దీని లక్ష్యం గురించి ఆలోచిస్తే..అసలు విషయం బయటపడుతుంది. పక్కాగా కాంగ్రెస్, ఆప్ పార్టీల ఎజెండాతో ఇది అవతరించింది. ఇందులో ప్రధాన ఎజెండాలో ఉన్న ఐదు హామీలు కాంగ్రెస్, ఆప్‌లవే అని చెప్పాలి.**






ఈ రెండు పార్టీల సూత్రధారులుగా అభిజిత్ అన్న వ్యక్తి అమెరికా నుంచి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ద్వారా ప్రకటించిన ఈ పార్టీ కేవలం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత యువతను బొద్దింకలతో, పరాన్నజీవులతో పోల్చడం వల్లే జెన్‌జీ గొంతెత్తిందని ప్రచారం చేస్తున్నారు. అయితే ఇక్కడ జస్టిస్ సూర్యకాంత ఏ సమయంలో ఎవరిని ఉద్దేశించి, ఎందుకు బొద్దింకులు, పరాన్న జీవులు అన్నాడో తెలుసుకోకుండా ఇష్టం వచ్చినట్లుగా బొద్దింకల పార్టీ అంటూ ప్రకటించడం, దానికి గొర్రెల్లాగా మద్దతు తెలపడం దారుణం. ఇది ఓ రకంగా కోర్టు ధిక్కరణ కిందకు వస్తుంది. కొందరు ఫేక సర్టిఫికెట్లతో లాయర్లుగా, ఆర్టిఐ కార్యకర్తల్లాగా సమాజం మీద పడి పోతున్నారన్న సందర్భంగా జస్టిస్ట్ సూర్యకాంత బొద్దింకలు పదాన్ని వాడారు. నిజంగానే జెన్‌జీ పోరాటం చేయాల్సిన సామాజిక రుగ్మతలు ఉన్నాయి. పాలకుల దుష్ట పన్నాగాలను దునుమాడాలి. మన విద్యావ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నందుకు గొంతెత్తాలి. మన వైద్యారోగ్య రంగాన్ని ప్రైవేటుకు తాకట్టు పెట్టినందుకు నిలదీయాలి. స్వాతంత్రోద్యమ కాలంలోనూ, ఆ తరవాత కూడా యువత దేశంలో కీలక భూమిక పోషించింది. అసోంలో విదేశీ చొరబాట్లకు వ్యతిరేకంగా అస్సాగణపరిషత్ చేసిన పోరాటం అనన్యసామాన్యం. ఇలాంటివి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. తెలంగాణ తొలిదశ, మలిదశలోనూ యువతే కీలక భూమిక పోషించింది. అయితే ఇవన్నీ పక్కన పెట్టి కేవలం కాంగ్రెస్, ఆప్ గేమ్ ప్లాన్‌లో యువత పడిపోవడం దౌర్భాగ్యం. నిజానికి చట్టసభల్లో అటు పార్లమెంటులోనూ,ఇటు అసెంబ్లీల్లోనూ కొన్ని కుటుంబాలే ఏళ్లుగా పట్టుకుని వేళ్లాడుతున్నాయి. ఆప్ చరిత్ర ఎవరికీ తెలియనిది కాదు. అన్నా హజారే అవినీతి వ్యతిరేక ఉద్యమాన్ని హైజాక చేసుకుని వచ్చిన అరవింద్ కేజ్రీవాల్ అవినీతిలో కూరుకుపోయారు. ప్రజల్లో కల్పించిన ఆశలను వమ్ముచేశారు. అన్నా హజరానేనే మోసం చేసి మనముందు ఇప్పుడు నిలబడ్డాడు. ఇకపోతే గబ్బిలాల్లాగా చట్టసభల్లో తరతరాలుగా కొందరే పట్టుకుని వేలాడుతున్నారు. ఒకే కుటుంబం నుంచి కొందరే పార్లమెంట్ లేదా, అసెంబ్లీల్లో ఉంటున్నారు. పార్లమెంటులో సోనియా, రాహుల్, ప్రియాంక ఉన్నారు. ఒకే కుటుంబం నుంచి వీరు ముగ్గురూ ఎందుకు ఉండాలి. అమిత్ షా కొడుకు ఏం అర్హత ఉందని బిసిసి అధ్యక్షుడయ్యారు. ఇలాంటివి ప్రశ్నించాలి. చంద్రబాబు కుటుంబంలో చంద్రబాబు, లోకేశ్, బాలకృష్ణ, శ్రీభరత్, పురందేశ్వరిలు మాత్రమే ఎందుకు ఉండాలి. తెలంగాణలో వెంకటస్వామి ఇద్దరు కొడుకులు వివేక, వినోద్‌లు ఎమ్మెల్యేలుగా ఉన్నారు. వివేక కొడుకు వంశీ ఎంపిగా ఉన్నారు. వీరంతా ఎస్సీ రిజర్వ్ కేటగిరీలో ఎంపికయ్యారు. మల్లు భట్టివిక్రమార్క బ్రదర్స్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఆయన భార్య పద్మవతిలు కూడా ఒకే ఇంటినుంచి ఎమ్మెల్యేలుగా ఉన్నారు. వీరే నాయకులా..ఇక వేరే వారు లేరా. తెలంగాణ ఉద్యమంలో యువత బలిదానాలు చేస్తే...కెసిఆర్, ఆయన కొడుకు, కూతురు, అల్లుడు, ఇంకా కొందరు బంధువులు తెలంగాణను భ్రష్టు పట్టించి దోచుకున్నారు. ఇలాంటి ఉదాహరణలు కోకొల్లుగా ఉన్నాయి. జెన్‌జీ అని చెప్పకుంటున్న యువత వీటిని నిలదీయాలి. కొందరే ఎల్లకాలం ప్రజాప్రతినిధులుగా ఎందుకు ఉండాలో అడగాలి. ప్రస్తుత డిజిటల్ యుగంలో రాజకీయాలను విశ్లేషించే విధానం పూర్తిగా మారిపోయింది. గతంలో తీవ్రమైన చర్చలు, వీధిపోరాటాల ద్వారా సాగిన రాజకీయ నిరసన నేడు సామాజిక మాధ్యమాల వేదికగా జరుగుతున్నది. మీమ్స్, పొలిటికల్ సెటైర్ల రూపంలో సాగుతున్నది. ఈ క్రమంలో జెన్-జీ యువత సృష్టించిన సరికొత్త వ్యంగ్యాస్త్రమే 'కాక్రోచ్ జనతా పార్టీ'. ఇది నిజమైన రాజకీయ పార్టీ కాకపోయినా ప్రస్తుత రాజకీయ వ్యవస్థలోని లోపాలను, నాయకుల అవకాశవాదాన్ని ఎండగట్టే విధంగా సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నది. అయితే ముందే చెప్పినట్లు దీని ఎజెండా కేవలం కాంగ్రెస్, ఆప్ ఎజెండగా నిలవడమే పెద్ద లోపభూయిష్టంగా ఉంది. అసలు సమస్యలు వదిలి రిటైర్డ్ జడ్జిలని ఎంపిలుగా తీసుకో, ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను నిలదీస్తాం వంటివన్నీ కాంగ్రెస్ ఎజెండా. సుమారు 145 కోట్ల ఈ దేశ జనాభాలో 65శాతానికి పైగా జనాభా 35ఏండ్ల లోపు ఉన్నవారే. అంటే ప్రపంచంలోనే అత్యధిక యువతను కలిగిన దేశమిది. ఈ దేశ భవిష్యత్తును నిర్ణయించాల్సింది వీరే. వీరే ముందుండి నడపాల్సిన అసవరం ఉంది. అపారమైన శక్తి కలిగిన ఈ దేశ యువతను తప్పుదోవ పట్టించేలా అభిజీత్ దీప్కే సామాజిక మాధ్యమాల వేదికగా కాక్రోచ్ జనతా పార్టీ ఏర్పాటుకు ముందుకు రావడం, యువతను ఆకట్టుకోవడం చేశాడు. అంతవరకు మంచిదే అయినా, ఆయన గతమంతా ఆప్‌లో పనిచేసిన అనుభవాన్ని మరువరాదు. అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్‌లకంటే కూడా 1.6 కోట్ల ఫాలోవర్స్‌తో దేశంలోనే అతిపెద్ద ఫాలోయింగ్ ఉన్నట్లుగా తేలింది. దేశంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా, ఏ సిద్ధాంతం గెలిచినా.. కొందరు నాయకులు మాత్రం తమ పదవులను, ఉనికిని కాపాడుకోవటానికి రాత్రికి రాత్రే అధికార పార్టీలోకి మారిపోతుంటారు. సిద్ధాంతాలు, విలువలతో సంబంధం లేకుండా ఎల్లప్పుడూ అధికారంలో కొనసాగే అవకాశవాద, ఫిరాయింపు నాయకులను ఈ బొద్దింకల పార్టీ నిలదీయగలిగితే మంచిదే. మన దేశ యువతరం ఆలోచనలు ఎంత ఉన్నతంగా ఆలోచనాత్మకంగా ఉన్నాయనేదానికి వారి కార్యాచరణ ముఖ్యం. సమాజంలో పెరుగు తున్న అవినీతిని, రాజకీయ అస్థిరతను సంస్కరించేందుకు యువత నడుం బిగించాలి. ప్రజాస్వామ్యంలో పాలకులను ప్రశ్నించటానికి, విమర్శించటానికి ఆరోగ్యకర మైన వేదిక అవసరం ఉంది. దేశంలో నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తున్న పాలకులను ఎంతమాత్రం క్షమించ రాదు. వారు ఏ పార్టీ వారైనా నిలదీయల్సిందే. ప్రజల ముందు దోషులగా నిలబెట్టాల్సిందే. నీట్ పరీక్షా పత్రం లీకేజీపై కూడా నిలదీయాల్సిందే. నేర చరిత్రలేని నాయకులు చట్టసభల్లో ఉండాలి. దేశం కోసం పాటుపడేవారంతా ప్రశ్నించటం నేర్చుకున్నప్పుడే భారత ప్రజాస్వామ్యం బలపడుతుంది. ప్రశ్నించడం మంచిదే అయితే, అనేక అంశాలను ప్రశ్నించడం ఎజెండాగా చేసుకుంటే మంచిది. అంతే తప్ప మరో రాజకీయ పార్టీ సృష్టించిన వేదిక ద్వారా చేయడం మాత్రం సరికాదు.



# కాక్రోచ్ గ్రూప్‌లో అంతా పాకిస్తానీయులే

## కేంద్రమంత్రి కిరణ్ రిజిజు వ్యాఖ్యలు తిప్పి కొట్టిన అభిజిత్ దీప్కే

కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు మధ్య సోషల్ మీడియా వార్ నడుస్తోంది. కాక్రోచ్ జనతా పార్టీ ఇన్‌స్టాగ్రామ్ పేజ్ ప్రారంభించిన ఐదు రోజుల్లోనే రెండు కోట్లకు పైగా ఫాలోవర్లు చేరారు. అయితే, సీజెపి ఫాలోవర్లను ఉద్దేశించి కిరణ్ రిజిజు ఎక్స వేదికగా పోస్టు చేశారు. వారిని పాకిస్తాన్, జార్జ్ సోరోస్‌కు చెందిన వారుగా పేర్కొన్నారు. దీనిపై అభిజీత్ దీప్కే ఆగ్రహం వ్యక్తం చేశారు. సీజెపి ఫాలోవర్లను పాకిస్తాన్ వారిగా చెప్పడాన్ని అభిజీత్ తీవ్రంగా ఖండించారు. తన ఖాతా హ్యాక కావడానికి ముందు ఫాలోవర్ల భౌగోళిక వివరాలకు సంబంధించిన సమాచారాన్ని సోషల్ మీడియాలో వెల్లడించారు. అందుకు సంబంధించిన స్క్రీన్ రికార్డింగ్‌ను తన ఎక్స ఖాతాలో పంచుకున్నారు. ఆ వివరాల ప్రకారం, 94 శాతానికి పైగా ఫాలోవర్లు భారతదేశానికి చెందినవారేనని అభిజీత్ తెలిపారు. భారత యువతను పాకిస్తానీయులుగా కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఎందుకు ముద్ర వేస్తున్నారని అంటూ ఎక్స వేదికగా ప్రశ్నించారు. దీనికి స్పందిస్తూ కేంద్ర మంత్రి రిజిజు మరో పోస్టు చేశారు. 'పాకిస్తాన్, జార్జ్ సోరోస్ వర్గాల నుంచి సోషల్ మీడియాలో ఫాలోవర్లను సంపాదించుకోవాలనుకునే వారిపై నాకు జాలి వేస్తోంది. భారతదేశంలో తగినంత జనాభా, 'అత్యంత చురుకైన యువత ఉన్నారు. వారు నిజమైన, విలువైన అనుచరులుగా ఉండగలరు. గుర్తింపు కోసం దేశ వ్యతిరేక శక్తులను ఆశ్రయించాల్సిన అవసరం లేదు' అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. కాగా, ప్రస్తుతం భారత్‌లో కాక్రోచ్ జనతా పార్టీకి సంబంధించిన అన్ని సోషల్ మీడియా ఖాతాలు నిలిపేశారు.




# పాక్ మధ్యవర్తిత్వంపై భారత్‌కు అభ్యంతరం లేదు

## అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో

అమెరికా-ఇరాన్ శాంతి చర్చల్లో పాకిస్థాన్ మధ్యవర్తిత్వం వహించడంపై భారత్‌కు ఎలాంటి అభ్యంతరమూ లేదని అగ్రరాజ్య విదేశాంగ మంత్రి మార్కో రుబియో పేర్కొన్నారు. నాలుగు రోజుల పర్యటన నిమిత్తం భారతదేశంలో ఉన్న రుబియో మంగళవారం జరగబోయే క్వాడ్ దేశాల విదేశాంగ మంత్రుల సమావేశానికి హాజరుకాబోతున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా మీడియాతో మాట్లాడిన రుబియో.. భారత్, పాక సంబంధాల గురించి స్పందించారు. 'భారత్‌కు పాకిస్థాన్ విషయంలో ఉన్న ప్రధాన ఆందోళనలు ఉగ్రవాద సంస్థల గురించే. వాటికి ఇరాన్ చర్చల్లో పాకిస్థాన్ పాత్రతో సంబంధం లేదు. పాక భూభాగం నుంచి పనిచేస్తూ భారతదేశాన్ని లక్ష్యంగా చేసుకుంటున్న సాయుధ ఉగ్రవాద బృందాల గురించే ఇండియన్లు ఎక్కువగా మాట్లాడతారు. వారు దాని గురించే ఎప్పుడూ ఆందోళన చెందుతూ ఉంటారు. కానీ ఇరాన్ విషయంలో మధ్యవర్తిత్వం గురించి ప్రస్తావన రాలేదు. దాని గురించి వారు ఫిర్యాదు చేస్తారని నేను అనుకోను' అని రుబియో పేర్కొన్నారు. దేశం అమెరికాకు అత్యంత ముఖ్యమైన వ్యూహాత్మక భాగస్వామి అని, ప్రముఖ వాణిజ్య భాగస్వామి అని రుబియో అభివర్ణించారు. 'ఈ బంధం బలంగా కొనసాగుతుందని నేను భావిస్తున్నాను. ప్రస్తుత అమెరికా పరిపాలన ముగిసేనాటికి రెండు దేశాల మధ్య బంధం మునుపెన్నడూ లేనంత బలంగా ఉంటుందని నేను నమ్ముతున్నాను' అని రుబియో అన్నారు.

# మొక్కరైతుల బొక్కబోర్లా

## కొనుగోళ్లు లేక నానా తంటాలు



నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో మక్కలు, జొన్న రైతుల పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో జరగాల్సిన కొనుగోళ్లు ముందుకు కదలడం లేదు. అనుమతులు రాకపోవడంతో కొనుగోళ్ల ప్రక్రియనే చేపట్టలేదు. మే 20 నుంచి జొన్న కొనుగోళ్లకు మార్క్‌ఫెడ్ ఏర్పాటు చేసింది. ఇప్పటికే మార్కెట్ యార్డుల్లో నెలల తరబడి పంట ఉత్పత్తులతో రైతులు పడిగాపులు కాస్తూ వేచి చూస్తున్నారు. మక్క రైతుల పరిస్థితి దయనీయంగానే చేరింది. కొనుగోళ్లు తూతూ మంత్రంగా చేపట్టి చేతులు ఎత్తేశారు. రూ.2400 కనీస మద్దతు ధర అన్నది ఎక్కడా అమలు కావడం లేదు. మక్క రైతులు బాధలకు ప్రభుత్వం స్పందించడం లేదు. మార్క్‌ఫెడ్ అధికార యంత్రాంగం చేతులు ఎత్తేసినట్లే కనిపిస్తోంది. కొనుగోళ్ల విషయంపై మౌనం పాటిస్తోంది. ప్రైవేటు కొనుగోళ్లు మినహాయించగా 8లక్షల 65వేల మెట్రిక టన్నులు ధాన్యం సేకరించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు 6లక్షల 29వేల 915 మెట్రిక టన్నులు ధాన్యాన్ని సేకరించారు. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 739 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.అన్ని చోట్ల కేంద్రాలను తెరిచారు. ప్రస్తుతం 653 చోట్ల కొనుగోళ్లు కొనసాగుతున్నాయి. 86 చోట్ల కొనుగోళ్లు పూర్తయ్యాయి. కామారెడ్డి జిల్లాలో 5లక్షల 11వేల మెట్రిక టన్నులు ధాన్యం సేకరించేందుకు టార్గెట్ పెట్టుకున్నారు. ఇప్పటి వరకు 3లక్షల 14వేల 589 మెట్రిక టన్నులు సేకరించారు. 42వేల 225 మంది రైతుల నుంచి రూ.751.55 కోట్లు చెల్లింపులు పూర్తి చేశారు. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 414 కొనుగోలు కేంద్రాలు ప్రతిపాదించారు. అన్ని చోట్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించగా 329 కేంద్రాల్లో ప్రస్తుతం కొనుగోళ్లు జరుగుతున్నాయి. 67 చోట్ల కొనుగోళ్లు పూర్తి కావడంతో మూసేశారు. ఆర్భాటంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం తప్ప కొనుగోళ్లు జరగక రైతులు కల్లాలవద్దనే పడిగాపులు పడుతున్నారు. కొన్నిచోట్ల ధాన్యం తూకం వేసి మూడు రోజులైనా, లారీలు వస్తలేవని సంచులు తీసుకుని పోవడం లేదు. తూకం వేసిన బస్తాలు ఎండల్లోనే ఎండిపోతున్నాయి. డ్రైవర్లకు రూ.2 ఇస్తేనే లారీలు వస్తాయని చెబితే దానికీ ఒప్పుకున్న రైతులు అందుకు కూడా సరే అంటున్నారు..

# వ్యవసాయం ఈజీ.. ధాన్యం అమ్మడం కష్టం

తెలుగు రాష్ట్రాల్లో ధాన్యం కొనుగోళ్లు,తరలింపు ప్రహసనంగా మారింది. కల్లాల్లో రైతుల దీనస్థితి టీవీల్లో కనిపిస్తున్నా, పత్రికల్లో వార్తలుగా వస్తున్నా..ప్రభుత్వాల్లో చలనం కానరావడం లేదు. పెద్దపెద్ద మాటలు మాట్లాడుతున్న పాలకులకు సామన్య రైతుల వేదన కనిపించడం లేదు. ఎవరు పాలనలో ఉన్నా ఇదే దుస్థితి ఉంది. తమ హయాంలో గొప్పగా చేశామని చెప్పుకుంటున్న బిఆర్ఎస్ హాయంలోనూ ఇవే దృశ్యాలు కనిపించాయి. రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయడం ప్రభుత్వాల బాధ్యత. లేదా ఏ పంటను కొంటారో చెప్పి అవే పంటలను పండించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి. కానీ అలా జరగడం లేదు. కెసిఆర్ హయాంలో వరేస్తే ఉరే అంటూ చెప్పిన మాటలను అప్పుడే మర్చిపోతే ఎలా. దీనికి కెటిఆర్ సమాధానం చెప్పాలి. కానీ ప్రభుత్వంపై నిందలు మోపడం తప్ప గ్రామాలకు వెళ్లి, ప్రభుత్వాన్ని ఒప్పించి కొనుగోళ్లు చేయించే పాత్రను ప్రతిపక్షం తీసుకోవడం లేదు. ఇకపోతే ఇప్పుడేమో మంత్రులు చెప్పేదొకటి గ్రామాల్లో కనిపిస్తున్నదొకటి. వర్షాకాలం దగ్గర పడడంతో పాటు, అకాల వర్షాలతోనూ రైతులు నానా ఇబ్బందులు పడ్డారు. పలుచోట్ల కల్లాల్లో ధన్యం తడిసి కొట్టుకుపోయింది. రోజులతరబడి కొనుగోలు కేంద్రాల్లో రాత్రనక పగలనకా గోస పడుతున్నా.. అధికారులు కనికరిస్తలేరని అన్నదాతలు ఆవేదన చెందుతున్న తీరును ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ఈ దేశంలో రైతులంటే అందిరికీ చులకనగా మారింది. ధాన్యం సేకరణపై ఇటీవల సిఎం రేవంత్ రెడ్డి అధికారులతో సమీక్షించారు. అయినా పరిస్థితిలో మార్పు రాలేదు. ధాన్యం కాంటా వేయడం లేదు. వేసిన ధాన్యం లారీలకు ఎక్కడం లేదు. లారీలకు ఎక్కేవరకు రైతులే కాపలాగా ఉండాల్సి వస్తోంది. ఆరుగాలం కష్టించి పండించిన పంటను అష్టకష్టాలు పడి కొనుగోలు కేంద్రాలకు తెస్తే రోజుల తరబడి వేచి చూసేలా చేయడం పాలకుల వైఫల్యం తప్ప మరోటి కాదు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి పక్కా ప్రణాళిక లేకపోవడమే ఈ దుస్తితికి కారణం. ఇకపోతే తెచ్చిన ధాన్యం అకాల వర్షాలకు ఎక్కడ తడుస్తుందోనని ఆందోళన చెందుతున్నరు. మరోవైపు తాలు, తడిసిందన్న కారణాలతో రకరకాల కొర్రీలు పెడుతూ నిలువు దోపిడీ చేస్తున్న తీరు ఏ గ్రామం వెళ్ళినా కనిపిస్తుంది. కొనుగోలు కేంద్రంలో యంత్రాల కోసం





గొడవలు, సీరియల్ నంబర్, వంతుల పేరిట నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇక పండిన ధాన్యం రోడ్డుపైన ఆరబెట్టేందుకు ఉదయం రోడ్డుపై నేర్పుకోవాలి, సాయంత్రం టార్పాలిన్ కప్పి కాపలాకాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. వర్షాలకు తడుస్తున్న వడ్లు మొలకెత్తుతుంది. కొనేటప్పుడు ఏం పరిస్థితి ఉంటుందోననే భయం పట్టుకున్నది. తడిసిన వడ్లను కూడా ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాల్సిన బాధ్య ఉంది. ఇలాంటి కష్టాల వల్ల సన్నకారు రైతుల నడ్డి విరుగుతోంది. ఎప్పుడు కొనుగోలు చేస్తారోనన్న ఎదురుచూపులకే రోజులు గడిచిపోతున్నాయి. ఎప్పుడు వానొస్తదో తెలియక భయంతో బతుకుతున్నారు. ముఖ్యంగా లారీలు రావడం లేదని ధాన్యం తరలించడం లేదు. చాలాచోట్ల కడుపు మండిన రైతులు రోడ్డెక్కుతున్నరు. తెచ్చిన ధాన్యం కాంటా వేసి, లారీల్లో తరలించే ఏర్పాట్లు చేస్తే ఈ దుస్థితి రాదు. తక్షణం ప్రభుత్వం స్పందించి ఒకటి,రెండు రోజుల్లో అన్‌లోడ్ చేయించేలా చర్యలు తీసుకోవాలి. లారీలు, హమాలీల కొరత కారణంగా రవాణాలో జాప్యం జరుగుతున్నది. ప్రజాప్రతినిధులు రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదు. ధాన్యం అమ్ముకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతులను పాలకపక్ష నేతలు పరామర్శించడం లేదు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయలేదు. వర్షం పడితే ధాన్యం తడిసిపోతుంది. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో తూకం వేయకపోవడంతో ఎండలో ఆరబోస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తూకం వేసిన గన్నీ బస్తాలు ఉండటం లేదు. లారీలు సకాలంలో రావడం లేదు. దీంతో ధాన్యం మిల్లులకు తరలించే వరకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నరు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. లారీల సమస్య తీవ్రంగా ఉన్నదని, అదనంగా డబ్బులు ఇవ్వాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు చెప్తున్నారు. ఈ యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లలో అడుగడుగునా రవాణా కష్టాలు నిత్యం ఎదురవుతున్నాయి. హమాలీలు అందుబాటులో లేకపోవడంతో పాటుగా లారీల కొరత వేధిస్తుండటంతో కల్లాల్లో ధాన్యం నిలిచి పోతుంది. రోజుల తరబడి వేచి చూస్తే కానీ ధాన్యం అమ్ముకునే పరిస్థితి లేకుండా పోయింది. దొడ్డు ధాన్యాన్ని దించుకునేందుకు రైస్ మిల్లర్లు తీవ్రంగా సతాయిస్తున్నారు. నాలుగైదు కిలోలు తరుగు పేరిట దోచేస్తున్నారు. లేదంటే లారీల్లోని ధాన్యం సంచులు దించుకునేందుకు ససేమిరా అంటున్నారు. లారీల యజమానులు సైతం సంచికి రూ.4వరకు వసూళ్లకు పాల్పడుతున్నట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైస్ మిల్లర్లకు తోడుగా పీఏసీఎస్ సెంటర్లలో సహకార సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. రైతులను నిలువునా ముంచేస్తున్నారు. ధాన్యం తరలించడంలో జాప్యం జరుగుతుండటం తో రైతులు రోడ్డు ఎక్కి ఆందోళనలు చేయాల్సి వస్తోంది. ఎక్కడ చూసినా గన్నీ సంచులు లేవని, లారీలు వస్తలేవని మక్కలు కాంటా వేస్తలేరని రైతులు వాపోతున్నారు. కాంటా పెట్టాలని అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. గన్నీ సంచులు లేవు మీరే కొనుక్కోవాలని అంటున్నారు. రైతులకు ఇది జీవన్మరణ సమస్యగా మారింది. ప్రభుత్వం వెంటనే దీనిపై దృష్టి సారించాలి. కలెక్టర్లు కూడా పెద్దగా పట్టించుకోవడం లేదని పరిస్థితులు చెబుతున్నాయి. ఈ సమస్యను ఎలా పరిష్కరిస్తారన్నది పాలకుల చిత్తశుద్ధిపై ఆధారపడి ఉంది.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com